# మరువబోకు మీవు మంచి మాట

(ద్విశతి)





# మరువబోకు మీవు మంచిమాట

(ద్విశతి)

రచన - **సన్నిధి జనార్దన స్వామి**

ధర్మ ప్రచారకులు, జ్యోతిష వాస్తు శాస్త్ర పండితులు



| | | |
|---|---|---|
| ప్రచురణ | - | **31 మే, 2009** |
| ప్రచురణ/కాపీరైటు© | - | చెరుకూరి గ్రూప్, వనస్థలిపురం, హైదరాబాద్-**70.** |
| ప్రథమ ముద్రణ | - | **1000** ప్రతులు |
| ప్రతులకు | - | సన్నిధి జనార్దన స్వామి<br>ఇ.నెం. **5-5/బి-978,**<br>ఎన్.జి.వోస్ కాలనీ,<br>వనస్థలిపురం, హైదరాబాద్ - **500070.**<br>Ph : **040-24243237, 99499 96942** |
| **DTP,** ముఖచిత్ర కళా రూప కల్పన | - | చి॥ షబ్బీర్ అహ్మద్, సీనియర్ ఎగ్జిక్యూటివ్, చెరుకూరి గ్రూప్ |
| వెల | - | రూ॥**25/-** |



**శ్రీ చెరుకూరి రామారావు**
ఛైర్మన్, చెరుకూరి గ్రూప్



**శ్రీమతి చెరుకూరి విజయలక్ష్మి**
వైస్ ఛైర్మన్, చెరుకూరి గ్రూప్

శ్రీరస్తు                                                        శుభమస్తు

సీ॥ నీతియు నియమాలు - నిష్టతో గడియించి
సంఘక్షేమముకోరు - సజ్జనుండు
దానధర్మములందు - తప్పక ముందుండి
ధారాళముగ నిచ్చు - దాత యితడు
వేలమందికి తాను - వేడ్కతో ధనమిచ్చి
సంతృప్తి జెందెడి - సాధుమూర్తి
బాలబాలికలన్న - బహు ప్రేమ గల్గియు
విద్యాలయాలను - విరివిగాను
అభివృద్ధి గావించి - అందులో పిన్నల
సంస్కరించెడినట్టి - సాధుమూర్తి
గుడిలొ ప్రతిష్టలు - గుడుల నిర్మాణంబు
అత్యంత ప్రీతితో - ఆచరించు
సంఘ శ్రేయస్సును - శ్రద్ధగా కాంక్షించు
పదవులు కోరని - పావనుండు

## మంచిమాట

ఆ॥ పుస్తకమ్మునొకటి - పొందుగా ముద్రించి
ఖ్యాతి గన్నవారు - కలరుగాని
పుస్తకాలు చాల - పొలుపుగా ముద్రించె
రాజతుల్యుడితడు - రామరావు

ఉ॥ అప్పుడు కృష్ణరాయలును - నద్భుతగ్రంథము లెన్నియో భువిన్
ఒప్పుగ వ్రాయజేశెనని - ఒద్దిక వింటిమి శాస్త్రమందునన్
ఇప్పుడు రామరావుబహు - యిష్టముతో బహుపుస్తకాల, తా
నిప్పుడు నచ్చువేశియును - యిప్పుడు రాయలు రామరావుయే

తే.గీ॥ పద్యకావ్యమ్ము దీనిని - ప్రాభవముగ
అంకితంబును యిచ్చెద - ఆదరముగ
నాదు కృతియును భర్తగా - నయముగాను
రామరావును వరియించె - రమణి కూడ

ఆ.వె.॥ మంచిమాటలనెడు - మా ముద్దు పుత్రిని
తగిన వరున కిచ్చి - తనిసినాడ
యిట్టి వరుడు దొరకు - టింతి భాగ్యము కాదె
సవతి పోరులేని - సాధ్వి యీమె

ఇట్లు
రచయిత
**సన్నిధి జనార్దన స్వామి**
తెలుగు సాహిత్య విశారద

# రచయిత ఆకాంక్ష

నాకు మొదటి నుండి పుస్తకాలు వ్రాయాలని గాని, వాటిని ప్రింటు చేయించాలని గాని ఎప్పుడూ ఆ కోరిక లేదు. కాని, శ్రీ తారా మనోహర్ గారు మాటల సందర్భంలో ఏమయ్యా! పద్యాలు చాలా బాగా వ్రాస్తావు కదా! ఏదైనా ఒక శతకం వ్రాయరాదా? అని అన్నారు. అందుకు నేను ఎందుకండీ అనేకానేక గ్రంథాలు ఉన్నాయి, వాటిని చదివే ఓపిక శ్రద్ధలూ ఉంటే చాలు సాహితీ సముద్రంలో కావలసినంత విద్యాధనమున్నదని తెల్పగా, అలా ఎందుకు అనుకుంటున్నావు, ఎవరి కృషి వారు తప్పక చేయాలి, నీవు నీ అనుభవాలనూ, మంచినీ నీకు నచ్చిన శైలిలో తప్పక వ్రాయండి అని అనడం, అదే స్ఫూర్తితో నేను మొదలు పెట్టడం జరిగింది. అతి స్వల్ప కాలంలో రెండు వందల పద్యాలు వ్రాయడం జరిగింది. అందులో మంచిని తెల్పాలని, మార్పు ఏ కొందరిలోనైనా తీసుకు రాగలిగితే అది నా జీవితానికి ధన్యాతిధన్యం అవుతుందని భావించాను. మంచి గురించి, నీతి గురించీ ఎప్పుడూ ధర్మ ప్రసంగాలలో ఉపన్యాసాలలో చెబుతూ ఉండే నా స్వభావాన్ని గుర్తించి ఒక మహా సభలో శతావధాని దత్తాత్రేయ శర్మగారు **9-4-1995** తేదీన "ధర్మ ప్రచారకులు" అను బిరుదుతో విశేషంగా సన్మానం చేసినారు.

నా ఆశయం ఎప్పుడూ మంచినీ, ధర్మాలనూ తెలుసుకోవాలని, తెలుసుకున్న ప్రతి విషయం పదిమందికి పంచాలనే భావము, ఆశయం గల నేను అదే సదాశయంతో "మరువబోకు మీవు మంచి మాట" అనే మకుటంతో మంచి మాటలనే మణులను హారాలుగా అల్లినాను. అవి ఎప్పుడో ప్రింటు కావలసి ఉండినది. అచ్చు వేయించుతామని కొందరు మిత్రులు **3** సంవత్సరాల పాటు తమ చెంత ఉంచుకోవడం జరిగింది. ఆ తర్వాత నాకు తెలియకుండగనే వేరే వారి ద్వారా యీ పుస్తకాన్ని చూసిన చెరుకూరి సంస్థల అధినేత శ్రీ రామారావు గారు దీనిని ప్రింటుచేయిస్తానని ముందుకు వచ్చారు. అంతకు ముందు ప్రింటు చేయిస్తామన్నవారి దగ్గర పుస్తక సమీక్ష చేసి వ్రాసిన వారి అభిప్రాయాలు సైతం లభించలేదు. యిల్లు మారేటప్పుడు ఎక్కడో పొరపాటైనవని

వారు తెల్పడం జరిగింది. గతంలో అభిప్రాయాలు వ్రాసిన వారు (1) పరిశోధక రత్న శ్రీమాన్ వైద్యం వెంకటేశ్వరాచార్యులు గారు (2) భారత భూషణ్ "తిరునగరి" వారు (3) శ్రీ వి.డి.వి. వెంకట్రమణమూర్తి గారు (4) శ్రీయుతులు వి. రామశేషయ్య గారు (5) ఉమ్మానారాయణ రెడ్డి గారి వంటి ప్రముఖులు అందంగా అభిప్రాయాలు వ్రాసి ఉండిరి. అనివార్య కారణాల వల్ల వారి అభిప్రాయాలను గ్రంథంలో వేయించలేక పోయినందుకు వారి నందరినీ క్షమింప కోరుతున్నాను. ఏది యేమైనా యీ విషయంలో చాలా చింతిస్తున్నాను.

నా భావాల గూర్చి అన్ని విషయాలు మీ కరకమలాలను అలంకరించిన ఈ పుస్తకమే మీకు తెలియజేయగలదు. తర్వాత మళ్ళీ యీ పుస్తకానికి అభిప్రాయం వ్రాయమని అడిగిన వెంటనే వ్రాసి యిచ్చిన సహృదయులు విద్యా వినయ సంపన్నులు శ్రీశ్రీ తారా మనోహర రావు గారు, శ్రీ ఫణిదెపు పాండురంగ ప్రసాద్ గారు, శ్రీ డి.వి.క్రిష్ణా రావు గారు, శ్రీ ఆచార్య వేణు గారు, శ్రీయుతులు అచ్యుత రావు గారు వారి అమూల్య సలహాలను అభిప్రాయాలను వ్రాసి ఇచ్చినందుకు వారికి మనసారా కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు తెలియ జేయుచున్నాను.

ఇంకొక మహానుభావుడు, త్యాగశీలి, వదాన్యుడు మంచినీ మార్పునూ కోరుతూ అనేకానేక గ్రంథాలు ప్రింటుచేయించి ఆవిష్కరించిన మహాతపస్వి సాయిదేశం - గాంధీ మార్గం అను గ్రంథ రచయిత శ్రీ చెరుకూరి రామారావు గారిని గూర్చి ఎంత చెప్పినా తక్కువే.

శ్లో - శతేషు జాయతేశూర, సహస్రేషుచ పండితః
వక్తా దశసహస్రాణి, ధాతా భవతి వానవా

అనగా వంద మందిలో ఒకడు "వీరుడు" ఉండును. వేయి మందిలో ఒకడు "పండితుడు" ఉండును. పదివేల మందిలో ఒకడు "వక్త" ఉండును కానీ "దాత" పుట్టడం మాత్రం కష్టము అని శాస్త్రం చెబుతుంది. ఎవరు ఏ విధంగా ఆశ్రయించినా లేదనక, కాదనక అందరినీ సంతోష పరచే సాత్వికుడూ సజ్జనుడూ, వదాన్యుడూ మరియు త్యాగంలో దాన ధర్మాలు చేయడంలో

ప్రత్యేకతను చూపే చెరుకూరి వారి గురించి రెండు మాటలు.

ఉ॥ ఎందరు లేరు యీ భువిని
ఎక్కువ సంపదలున్నవారు, వా
రందరు రామరావువలె
ఆదరబుద్ధితొ దాన మార్గ, మా
నందము తోడనెంచుకొని
అర్థికినెప్పుడు కాదులేదనే
అందవిహీన వాక్యములు
ఆడని సజ్జన సద్గుణుండిలన్.

వీరిని గురించి వ్రాయాలంటే అదే ఓ పెద్ద గ్రంథం అవుతుంది. అటువంటి సత్పురుషుడు, సజ్జనుడు, సదాశయ సంపన్నుడు శ్రీ రామారావు గారు. వంద వసంతాలు వీక్షించుగాక. వారి ఈప్సితములు నెరవేరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ. చివరగా యీ పుస్తకాన్ని డి.టి.పి. చేసిన చిరంజీవి "షబ్బీర్" తాను ముస్లిం అయినా భాషా దోషాలు లేకుండ చక్కగా అందంగా చూడ ముచ్చటగా తయారు చేసిన యీ అబ్బాయికి భగవంతుడు ఆయురారోగ్యాదులు, సుఖ సౌభాగ్యాలు చేకూర్చాలని దేవుని ప్రార్థిస్తూ, ఆశీర్వదిస్తూ విరమిస్తున్న.

మీ అభిమాన పాత్రుడు
గ్రంథ రచయిత **సన్నిధి జనార్దన స్వామి**
"తెలుగు సాహిత్య విశారద" ధర్మప్రచారకులు
జ్యోతిష వాస్తు శాస్త్ర పండితులు, వనస్థలిపురం. ఫోన్- 24243237

# జనార్దన శంఖారావము

మహాభారత యుద్ధ ప్రారంభంలో పాండవులు, కౌరవులు తమ తమ శంఖాలను వీరోచితంగా పూరించారు, భేరీ నినాదాలు చేశారు. కాని ఆయుధం పట్టనని వాగ్దానం చేసిన శ్రీ కృష్ణుడు పాండవ పక్షాన ప్రప్రథమంగా పాంచ జన్య శంఖాన్ని పూరించాడు. ఆ సమయంలో భగవానుడు యుద్ధవీరుడుగా రణరంగంలో ప్రవేశించలేదు. కేవలం రథసారధిగా, పార్ధసారధిగా మాత్రమే రథంపై ఆసీనుడైనాడు. అయితే శ్రీ కృష్ణుని ప్రథమ శంఖారావంలోని గూఢార్ధాన్ని మనం పరిశీలించాలి. భగవానుని శంఖనాదానికి రెండు ప్రముఖ లక్ష్యాలు గోచరిస్తున్నాయి. ఒకటి 'ధర్మవర్తన' శ్రీ కృష్ణుని స్వపక్షమని, 'అధర్మాచరణ' తనకు విపక్షమని కౌరవవీరులకు సుస్పష్టం చేయటం. రెండవది శ్రీ కృష్ణుడు కేవలం పార్ధునకు మాత్రమే రథసారధి కాదని సంపూర్ణ పాండవ పక్షానికి విజయ సారధిగా జయ కేతనాన్ని ఆవిష్కరించగల దివ్యశక్తి సంపన్నుడని కౌరవ శ్రేణులకు ముందుగా దృఢమైన సంకేతాన్ని పంపటం.

ఎక్కడ ధర్మాచరణ ఉంటుందో అక్కడ దైవానుగ్రహం లభిస్తుంది. ఎక్కడ దైవానుగ్రహం ఉంటుందో అక్కడ విజయం తథ్యమని మహాభారతం నిరూపించింది. "యతః ధర్మస్తతో కృష్ణః। యతః కృష్ణస్తతో జయః" అలాగే యీనాడు కవి వరేణ్యుడు పౌరాణిక ప్రవచనా విశారదుడు మాన్యశ్రీ సన్నిధి జనార్దన స్వామి సార్ధక నామ ధేయుడై "మరువబోకు మీవు మంచి మాట" అను మకుటంతో "ద్విశతి" ధర్మ శంఖారావాన్ని మరొకమారు మనకు వినిపిస్తున్నారు. ధర్మ రక్షణే స్వీయ రక్షణకు ఆధారం అని మనల్ని జాగృతం చేస్తున్నారు. మనం కూడ పాండవుల వలె ధర్మాన్ని ఆదరించి, ఆచరించి జీవన పోరాటంలో విజయులం కావాలని కవి ఆకాంక్ష. వారు రచించిన పద్య రత్నాలు వేద ప్రతిపాదిత ధర్మ సూక్ష్మాలు, సుభాషిత ఆణిముత్యాలు.

మనం గొప్పగా చెప్పుకుంటున్న నేటి నాగరిక సమాజంలో మానవులకే శ్రేయస్సును చేకూర్చే బోధకులు లేకపోలేదు. కాని తాము ఆచరించి ఇతరులకు బోధించే వారు కొందరు మాత్రమే. అలా బోధించే వారున్నారు. వారి

ఉపదేశాలు విని దీక్షతో ఆచరించే వారు యీనాడు అరుదు. "మంచి మాట వినరు మనసిచ్చి చెప్పిన, చెడ్డమాట త్వరగ చెవినిడుదురు" అని భగవాన్ బాబా ఆవేదన వ్యక్తం చేశారు.

ఈనాడు ప్రభుత్వం వారు ఉన్నతాదర్శాలను మానవీయ విలువలను ప్రదర్శిస్తున్న ప్రభోదాత్మక ఉత్తమ చిత్రాలకు, టీ.వి. సీరియల్స్‌కు అవార్డులు, రివార్డులు అట్టహాసంగా అందిస్తున్నారు. ఈ ప్రోత్సాహం మంచిదే. కాని యీ పురస్కారాలు, పారితోషికాలు కృత్రిమ పాత్రలతో కూర్చిన కథలలోని వాచిక ప్రబోధాలకు, అట్టి పాత్రల కృత్రిమ ఆచరణకే గాని అందులోని నిజజీవిత ప్రమేయం లేదు గదా. చెప్పవచ్చు కోటి చేయరు ఒకటి. చెప్పుట సులభము చేయుట కష్టము అన్నారు భగవాన్ బాబా వారు. ప్రతి ఒక్కరు మంచి వస్తువులు, మంచి దుస్తులు, మంచి ఉద్యోగం, మంచి రూపం, ఒకటేమిటి ప్రతిది మంచిదే కావాలని వాంఛిస్తారు. కాని మంచి శీలం, మంచి ప్రవర్తన కావాలని సంకల్పించడం గాని, ప్రయత్నించడం గాని యీనాడు అరుదుగా కనపడుతున్నది. ఈ బలహీనతకు కారణం మంచితనం వలన సమాజంలో గౌరవం పెరగవచ్చును, యింకా మన ప్రాథమిక అవసరాలు తీరవచ్చును. కాని మన ఆశలు, నానాటికి పెరుగుతున్న మన కోరికలు, ఆడంబరాలు సిద్ధించవని నవ నాగరికుల అభిప్రాయం కావచ్చు. అందుకే మనిషి మంచికి దూరమవుతున్నాడు. మనస్సుకు మాలిన్యాన్ని అంటించుకుంటున్నాడు. కోరినవి అన్నీ ఉన్నా నేటి మానవుడు కించిత్తు సుఖాన్ని, సౌకర్యాన్ని అనుభవిస్తున్నాడు కాని పూర్ణ శాంతిని మాత్రం పొందలేక పోతున్నాడు. ఇది రోదసీ యుగమైనా రోదన, (దుఖం) అణు యుగమైనా అశాంతి తొలగటం లేదు. ఒక్క శీలం పోతే అన్నీ పోయినట్లే. ఒకవేళ ఉన్నా లేని ఫలితాన్నే ఇవ్వగలవు. రావణాసురుడు గొప్పవాడు. శ్రీరాముడు మంచివాడు. మంచితనం ముందు గొప్పతనం కూలిపోయింది, కాలిపోయింది. "మంచి కాలము పదవులు మంచి బ్రతుకు కోరుచుందురు మనుజులు కోరబోరు/మంచి బుద్ధులు జ్ఞానంబు మంచినడత" అన్నారు భగవాన్ బాబా వారు. ఇది సామాన్య మానవ మనస్తత్వం.

శ్రీ జనార్దన స్వామి నాకు చిరపరిచితులు. వారు అనేక ఆశ్రమాలు సందర్శించి, సాధువులు, సంతులు, సన్యాసుల సన్నిధిలో ఆర్ష విజ్ఞాన సముపార్జనలో శిక్షణ పొంది భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను తమ పెన్నిధిగా అనుభవిస్తున్నారు. సమాజానికి పంచుతున్నారు. ముఖ్యంగా శ్రీ స్వామి యొక్క హిత భాషణం, స్మిత భాషణం, నిరాడంబర వేషధారణం మనల్ని ఎంతగానో ఆకర్షిస్తుంది, ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం జ్యోతిష, వాస్తు పండితులుగా సమాజానికి గణనీయమైన సేవ జేస్తున్నారు. కుటుంబ మరియు వ్యక్తిగత సమస్యల పరిష్కారం కొరకు శాస్త్రీయమైన సలహాలు సాధనలు సూచిస్తున్నారు. వీరు రచించిన పద్య కావ్యము అమూల్యమైన సూక్తి సుధతో విలసిల్లుతూ దివ్యజీవన సాధనకు మార్గదర్శనం చేయించగలదని నా పూర్ణ విశ్వాసం. నిరక్షరాస్యులు కూడ యీ పద్య సూక్తులు శ్రవణం చేసి సులభంగా భావాన్ని గ్రహించగలరు. పుస్తకంలో పేర్కొనిన పద్య శీర్షికలు విధి నిషేధములతో గూడి ధర్మ సంగ్రహం గాను శాస్త్ర సమ్మతం గాను శోభిల్లుతున్నవి.

ఏ విధమైన వ్యాఖ్యానంతో పనిలేని యిలాంటి స్వయం బోధక ధర్మ సర్వస్వాన్ని సరళ సుందరమైన పద్య రూపంలో సమాజానికి జ్ఞానపుష్పంగా సమర్పించిన శ్రీ జనార్దన స్వామి ఎంతగానో అభినందనీయులు, పూజనీయులు.

జై సాయి రాం

**డి.వి. కృష్ణారావు**

శ్రీ సాయి పాద రేణువు (రిటైర్డు డి.ఇ.ఓ, విద్యాశాఖ)

మనసునందు మంచి మాటలందున మంచి
నడత లందు మంచి పొడమకున్న
సాయి మిము మెచ్చి సంతోష మెటులిచ్చు
చెప్పరయ్య మీరె ఒప్పుకొందు - బాబా

# మంచిని పెంచే - మరో ప్రయత్నం

ఆది మానవుని నుండి ఆధునిక మానవుని, ఆశలు, ఆలోచనలు, మంచికన్నా చెడు వైపే పరుగిడుతుంటాయి. సృష్టికర్త కూడా సృష్టిలో గుణదోషాలను సమాన స్థాయిలోనే సృష్టించాడు. భౌతిక సుఖాలే సర్వస్వం అనుకొనే నేటి మానవుడు శ్రమ లేకుండా, సత్వర భోగభాగ్యాలనుభవించాలని భావిస్తున్నాడు. సామాజిక, సాంప్రదాయ నియమ నిబంధనలకు తిలోదకాలిస్తున్నాడు.

"ధర్మో రక్షతి రక్షితః" అను ఆర్యోక్తి ననుసరించి, ధర్మ బద్ధంగానే అర్థ, కామాలను సాధించుకోవాలని అలనాటి వేదాలు, ఉపనిషత్తులు, రామాయణ, భారత, భగవద్గీత, భాగవత కావ్యాలు నిరంతరం ఘోషిస్తూనే ఉన్నాయి. ఐనా మనిషి మారలేదు, అసత్యం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం కామినీ-కాంచనాల యెడ ప్రలోభాలను పెంచుకుంటూ సమాజంలో అభద్రతా భావాన్ని వ్యాపింపజేస్తున్నాడు. కవులు, పండితులు, సాహితీ వేత్తలు తమ వంతు ప్రయత్నంగా కథలు, కవితలు, కావ్యాలు, నాటకాలు, రచనలు ప్రతినిత్యం పుంఖాను పుంఖాలుగా వెలువరిస్తూనే ఉన్నారు. యీ సాహితీ ప్రక్రియ కొనసాగుతూ వుండాల్సిందే.

నేటి సమాజంలో ప్రబలిన విశృంఖలత, ధనవ్యామోహం, అవినీతి, అభద్రతను చూస్తూ అనుభవించిన స్వానుభవమే సన్నిధి వారి కలం నుండి జాలువారిన ద్విశతి ఆటవెలదుల పద్య సమాహారమే యీ చిన్న పుస్తకం.

స్వయాన పౌరాణికులు, జ్యోతిష్య, వాస్తు శాస్త్రాల పరిజ్ఞానమున్న సన్నిధి జనార్ధన స్వామి గారి స్వీయ, స్వానుభవ అక్షర సాక్ష్యాలు యీ ఆటవెలదులు. "మరువబోకు మీవు మంచిమాట" - మకుటంతో, మందలింపు మాటలను, వ్యావహారిక తెలుగు పదాలతో రచన సాగించిన సన్నిధి వారు అభినందనీయులు.

ఎక్కడ ఏ మంచి కనిపించినా, ఆయస్కాంతం వలే అతుక్కపోయే స్వభావం చెరుకూరి రామారావు గారిది.

"నీవు మంచిగా ఉండటం మంచిదే, కాని ఆ మంచితనాన్ని పది మందికి పంచడం మరీ మంచిది' అన్నారు. పూజ్య బాపూజీ ఆచరణలో 'గాంధీ మార్గం'లో పయనిస్తున్న చెరుకూరి రామారావు గారు సన్నిధి వారి మంచిమాటను పది మందికి పంచాలనే సద్భావంతో అందంగా ప్రచురించిన "చెరుకూరి గ్రూప్" కీర్తి కిరీటంలో మరొక కలికితురాయిగా భావిస్తూ, మిత్రులు రామారావుగారి వదాన్యత దిన-దిన ప్రవర్ధమానంగా, ఇనుమడించాలని, ఆ పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ - స్వామి వారి కలం నుండి, సామాజిక హిత రచనలు మరెన్నో రావాలని ఆకాంక్షిస్తున్నాను.

కొసమెరుపు

ఆ.వె. మంగళములు మంచి - మాటలకెపుడు
మరువబోకునీకు - మంగళంబు
ప్రేమ తోడ చదువు - పెద్దలు మెత్తురు
మరువబోకు మీవు - మంచిమాట

ఇట్లు మీ

**తారా మనోహర్**

విశ్రాంత - హిందీ భాషా పండితులు

వనస్థలిపురం, హైదరాబాద్.

"కవి శిరోమణి"
**బ్రహ్మశ్రీ ఫణిదెపు పాండురంగ ప్రసాద్**, బి.ఎ. హెచ్.డి.సీ.
**6-3-1238**, యన్.జీ.వోస్. కాలనీ,
వనస్థలిపురం.

## అభినందన

ఈ సృష్టిలో "ఆత్మావైపుత్రనామాని"గా ప్రాణికోటి ఉన్నా, ఏకత్వంలో భిన్నత్వంగా తల్లి, తండ్రి, పిల్లలు, అనుబంధాలు అవతరించాయి. మంచీ, చెడులూ, వెలుగు, చీకట్లూ, మృత, అమృతత్వాలూ, చోటు చేసుకొన్నాయి. అవి ఒకదాన్ని మరొకటి వెన్నంటే ఉంటాయి. అందువల్ల సంఘంలో సుఖ దుఃఖాలకు, నీతి, అవినీతులకు అనేక రూపాలలో స్థానం ఏర్పడింది. ఈ సంఘాన్ని అనేక దృక్కోణాలతో పరిశీలించి, అనేక మంది ప్రాచీన కవులు చాలా శతకాలు పద్యాత్మకాలుగా విరచించారు. సమాజంలో ఉన్న కుళ్ళును, చెడును, చీడను, చీత్కరించడం కూడా జరిగింది. నీతి, న్యాయ, ధర్మ వ్యవస్థలను ఎత్తి చూపడం జరిగింది.

12వ శతాబ్ది నుండి తెలుగు భాషలో శతక రచన ప్రారంభమైంది. శ్రీ మల్లికార్జున పండితారాధ్యుడు మొదటి ఆంధ్ర శతక కర్త అని అనవచ్చును. సర్వేశ్వర శతకమును రచించిన యదావాక్కుల అన్నమయ్య రచన తరువాతది. ఈ విధంగా ప్రారంభమయిన శతక సాంప్రదాయం రామదాసు ఆటవెలది పద్యాలను ఆశ్రయించడం వలన పండితులకు శతకాలపై అంతగాగురి కుదిరింది కాదు. అయితే శతకాలలో మత్తేభాలతో పాటు శార్థూల విక్రీడితాలు, ఉత్పల మాలలు, కంద, సీస పద్యములు కూడా శతక కవులు ఆశ్రయించారు. నేడు తెలుగు సాహిత్యంలో శతకాల సంఖ్య సహస్రాధికమై అలరారుచున్నవి.

తెలుగు శతకాలలో జ్ఞానము, భక్తి, వైరాగ్యము, శృంగారము, నీతి, సాంఘిక, ఆర్థిక, రాజకీయ విషయాలు చోటుచేసుకున్నాయి. సుమతి శతకము, కృష్ణ శతకము, భాస్కర శతకము, దాశరథీ శతకము, నరసింహ శతకము, శ్రీ కాళహస్తీశ్వర శతకము, అతి చమత్కారమైన ఆంధ్ర నాయక శతకం ఇవి

అన్నీ ఆబాలగోపాలానికి చిరపరిచితాలు. గువ్వల చెన్నుని శతకం, కవి చౌడప్ప శతకం వంటివి కూడా సుప్రసిద్ధములు. వేమన శతకము అత్యంత ప్రజాదరణము పొందింది. శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వాముల వారు రచించిన "శ్రీ కాళికాంబ సప్తశతి" 700 పద్యములతో ఈ మధ్య ప్రచారంలోనికి వచ్చింది. శతకం వాఙ్మయ చరిత్ర అతి విస్తారమయింది. కవి తన చుట్టూ ఉండే ప్రజా సామాన్యం మాట్లాడే వాడుక భాషలోని నుడికారాలను, ఉపమానాలను, కొన్ని ప్రత్యేక మాండలిక పదాలను గ్రహించడం సహజం. స్వానుభవ విశేషాలను, హృద్గత విషయాలను, ప్రస్ఫుటంగా నివేదించుకొనడానికి గాను కవులు శతక పద్ధతినవలంబించిరనవచ్చును.

ఈ విధంగా పాల్వారిన శతక వాఙ్మయ నేపథ్యంలో ప్రస్తుతం జ్యోతిష, వాస్తు పండితులు శ్రీమాన్ సన్నిధి జనార్ధన స్వామి, రెండు వందల ఆటవెలది పద్యాలతో "మరువబోకు మీవు మంచిమాట" అనే మకుటంతో నీతిని బోధించే పద్యాలతో మన ముందుకు వస్తున్నారు. ఈ ద్విశతిలో భాష సులభమై సర్వజన సుబోధకముగా నున్నది. అక్కడక్కడ రాయలసీమ మాండలికాలు కూడా చోటు చేసుకున్నవి.

శతకారంభము శ్రీకారంతో ఆరంభించుట అటు వేద సమ్మతము, ఇటు సాహిత్య సమ్మతము అయివున్నది. సత్కృతులకునెల్ల శ్రీకారము ముందుంచుట సకల శుభదాయకము గదా! శ్రీ జనార్ధన స్వామి గారికి లోకజ్ఞత సమాకాలీన సామాజిక స్పృహ, విభిన్న మానవ మనస్తత్వ పరిశీలనా దృష్టి లోతుగానున్నాయి. తల్లి, తండ్రి, గురువు, భార్య, పుత్రులు, మిత్రులు, నీతినియమాలు, కామక్రోధములు, జ్ఞానవిజ్ఞానములు, విద్యావైభవము, మాట మంచితనము, సమయజ్ఞానము మొదలగు విషయాలు ఈ శతకంలో గోచరిస్తాయి.

మంచికోరినేను – మంచి మాటలగూర్చి
మణుల హారముగను – మలచినాడ
మంచివారు దీని – మరువక ధరియింత్రు
మరువబోకు మీవు – మంచిమాట.

అంటూ ఈ ద్విశతి పద్య రచయిత తన సదాశయాన్ని ఆవిష్కరించారు. "మంచి మాటల పుట్ట"యైన ఈ పద్యాలు పఠితల మనస్సులను తప్పనిసరిగా ఆకర్షిస్తాయి. సహృదయుడు, కష్టజీవి, ఆధ్యాత్మికవేత్త, వేదవిజ్ఞాని, జ్యోతిష వాస్తుపండితుడు, మంచి ఉపన్యాసకుడు అయిన వీరి నుండి ముందు ముందు మరిన్ని కావ్యాలు వెలువడగలవని, వారి కుటుంబం ఆయురారోగ్య భాగ్యములతో వర్ధిల్లి, సత్కీర్తిని పొంది సుఖించవలయునని ఆ సర్వేశ్వరుని ప్రార్థిస్తున్నాను. శ్రీ జనార్దన స్వామి గారి కృషిని అభినందిస్తున్నాను.

చిరాయురస్తు

ఇట్లు

**ఫణిదెపు పాండురంగ ప్రసాద్**

# పెద్దల సుద్దులు - పెరుగన్నపు ముద్దలు

శ్రీమాన్ సన్నిధి జనార్దన స్వామి వారు నాకు ఆప్త మిత్రులు. జ్యోతిష వాస్తు శాస్త్రాలలో తలస్పర్శి పాండిత్యం కలిగినవారు. వారి కుమారులు శ్రీ సన్నిధి శ్రీకాంత్ నా శిష్యుడు కావటం మరింత సన్నిహితులుగా మారే అవకాశం కలిగింది. శ్రీ జనార్దన స్వామి తమ విశాలమైన లోకానుభవంతో, అనుభవం చేత రంగరించిన సూక్తులను భావితరాలకు అందివ్వాలన్న కోరికతో రచించిన ద్విశతి "మరువబోకు మీవు మంచిమాట" అన్న మకుటంతో రచించారు. అన్నీ ఆటవెలది పద్యాలే. మరో వేమన్న లాగ అన్వయ కాఠిన్యం లేకుండా తెలుగు పాఠక లోకానికి అందించారు. ప్రతి పద్యం ఒక మకరంద బిందువులాగ వుండి చప్పున చప్పరిస్తూ జ్ఞాపకంలో ఒదిగిపోతుంది. ఈ శతకం అచ్చువేస్తే భావి భారత పౌరులైన పిల్లలకు మన విలువలు తెలుస్తాయి. దీన్ని తొందరగా పాఠకలోకానికి అందివ్వండి అని పలుమార్లు చెప్పడం జరిగింది. ఈనాటికి నా మాట సాకారమవుతున్నందుకు నాకు పట్టరాని సంతోషంగా ఉంది. ఇందులోని "పెద్దల మాట పెరుగన్నపు మూట" అన్న లోకోక్తి అనుసరించి ఇందులోని ఒకటి రెండు విషయాలు మనవి చేస్తాను.

ఇందులో కవిగారు పద్యాలకు శీర్షికలను కూడా పెట్టారు. ఇందులోని శీర్షికలు పన్నెండు. ద్వాదశాదిత్యుల్లాగ అవి ధగధగా మెరిసిపోతున్నాయి. క్రొత్తకాంతులు మెదళ్ళకు అందిస్తున్నాయి. శీర్షికలు **1.** తల్లిదండ్రుల ఔన్నత్యము **2.** నీతి నియమాలు **3.** కామక్రోధములు **4.** విద్యావైభవము - విశిష్టత **5.** జ్ఞాన విజ్ఞానములు **6.** స్త్రీ ఔన్నత్యము **7.** స్వార్థము **8.** మాటలలో మాణిక్యాలు **9.** సోమరితనము **10.** సమయము - విలువ **11.** కోపము - విధిబలీయము **12.** జంతుబలి - భక్తి

ఒక్కొక్క శీర్షికలో సుధామధురంగా సూక్తులను అందించారు. తల్లి దండ్రుల ఔన్నత్యము అనే శీర్షికలో ఈనాటి పిల్లలు యువకులు తల్లిదండ్రుల పట్ల ప్రేమను, అభిమానాన్ని మరిచిపోతున్నారు. ఆర్ష సంస్కృతిలో మాతా పితరులకు ఎంత ఉన్నత స్థానాన్ని కల్పించినారో, వారినెంతగా ఆరాధించినారో

భారతీయ కుటుంబ పటిష్టతకు, ఎంతటి విలువలను ఆపాదించినారో, తల్లిదండ్రుల పట్ల ఎంతటి పూజ్య భావమును చూపించాలో ఈ శీర్షికలో అద్భుతంగా తెలియజేశారు.

విద్దె బుద్ధి నేర్పి - విలువలు తెల్పియు
ప్రేమతోడ పెంచి - పెద్ద జేసి
నీదు మేలు గోరు - నీ తండ్రి బూజించు
మరువబోకు మీవు మంచిమాట

తల్లితండ్రి గురువు - దైవ సమానులు
ధర్మమెరిగి - దాని తత్త్వమెరిగి
భక్తి తోడవారి - భజియింపుమెప్పుడు
మరువబోకు మీవు మంచిమాట

మహిని జన్మమిచ్చి - మంచికోరిన వారి
కఠినభాషలాడి - కరువబోకు
వారు బాధ పడిన - వర్ధిల్లవెప్పుడు
మరువబోకు మీవు మంచిమాట

ఇలాంటి మంచి మాటలు చెప్పి తల్లి దండ్రుల పట్ల ప్రేమను ఆరాధనను పెంచుకోవాలని మంచి మాట చెప్పి దారి చూపారు.

ఇవ్వాళ పెరిగి పోతున్న అవినీతి కార్యక్రమాలు చూస్తుంటే, నీతి నియమాలు చిన్ననాడే విధిగా నేర్పాలి. నైతిక విద్య లేక పోవటం వల్లనే నేడు ఇన్ని ఘోరాలు కలుగుతున్నాయని భావించి నీతి నియమాల ప్రాముఖ్యాన్ని చక్కగా వివరించారు.

ధర్మమార్గ మందు - ధనము సంపాదించు
అందు తృప్తి సుఖము - లబ్బు నీకు
వక్రమార్గమందు - వచ్చిన నిల్వదు
మరువబోకు మీవు - మంచిమాట

ధర్మ మార్గము ద్వారానే ధనాన్ని సంపాదించాలని, అలా సంపాదించిన ధనము వల్లనే నిజమైన తృప్తి కలుగుతుందని, వక్ర మార్గము ద్వారా వచ్చిన సంపద నిల్వదని, సక్రమార్జన ఇచ్చిన ఆనందము, సుఖము, అక్రమార్జన ఇవ్వదని దాని కొరకు వెంపర్లాడ రాదని హితవు పలికారు. ధనము, విద్య, రూపము కల్గుట వల్ల గర్వం కలుగుతుందని, దాని వల్ల మిడిసిపడెడు వారు ఎప్పుడూ పతనమవుతారని, వినయంగా ఒదిగినపుడె విద్యకు, ధర్మంగా ఉపయోగించినపుడె ధనానికి, మంచి నడవడి కలిగి ఉంటేనే రూపానికి విలువని ఇందులో ఒకే ఒక్క మాటతో "మిడిసిపడెడువారు" అన్న దానితో అల్పాక్షరముల అనల్పార్ధ భావనను అందించారు. ఈ శతకంలో ఈ శీర్షిక 'ప్రాణనాడి' వంటిది. ఇందులో కవిగారు **74** పద్యాలను విశేషంగా అందించారు.

అరిషడ్వర్గములలోని కామక్రోధాలను గూర్చి ప్రత్యేకంగా పేర్కొంటూ, వాటిని వదులుకొమ్మని అందరూ చెబుతారు కాని, వాటిని ఆచరించటం కష్టసాధ్యమని "చెప్పుట సులభంబు – సేయుట కష్టంబు" అని అది మరవకండి ఆచరించి చూపండి అని బోధ చేశారు.

విద్య యొక్క విశిష్టతను తెలియజేస్తూ ఈ శతకములో మూడు శీర్షికలను పెట్టి దాని ప్రాముఖ్యాన్ని ముప్పేటలా ఉగ్గడించారు. ఆ శీర్షికలు **1.** విద్యావైభవము **2.** జ్ఞానవిజ్ఞానము **3.** విద్య విశిష్టత. ఈ మూడు కూడా ఒకే అర్థాన్ని పరమార్థాన్ని తెలియజేస్తున్నాయి. మనిషికి విద్య విశిష్టత, విద్యా వైభవము, జ్ఞాన విజ్ఞానము ఆవశ్యకతలు ఈ శీర్షికల ద్వారానే తెలుస్తున్నాయి. ధనాన్ని దాచుకోవాలి, విద్యను పంచుకోవాలి. ప్రపంచంలో పంచిన కొద్దీ పెరిగే ధనం ఒక విద్యా ధనం మాత్రమే. అలాంటి విశ్వవర్ధనమైన ధనాన్ని పదుగురికి పంచాలి. అలా పంచక దాచుకున్న వాడు బ్రహ్మ రాక్షసుడిగా పుడతాడని, విద్యకు బోధించడమే పరమావధి అన్న విషయాన్ని కవిగారు నొక్కి చెప్పారు.

గొప్ప విద్యయుండి - గోప్యమ్ముగా దాచి
బోధ చేయనట్టి - పురుషులెపుడు
బ్రహ్మ రాక్షసులుగ - ప్రభవింతురందురు
మరువబోకు మీవు - మంచిమాట

“స్త్రీ ఔన్నత్యము” అన్న దాంట్లో స్త్రీ యొక్క గొప్పతనాన్ని సమాజ వికాసమునకు స్త్రీయే ముఖ్య కారణమని వారిపట్ల తగిన గౌరవ మర్యాదలు కలిగి ఉండాలని ఇందులో చెప్పారు.

మానినీయతకును - మర్యాదలకునైన
ఇంటి పేరు పెంచు - ఇంతులకును
సాటిలేరు సాధ్వి - సమముగా రెవ్వరు
మరువబోకు మీవు - మంచిమాట

ఇంటి పేరు పెరుగు - ఇల్లాలి వల్లనె
కులము పేరు పెరుగు - కొడుకు వలన
వదురుపోతు వలన - వైరాలు పెరుగును
మరువబోకు మీవు - మంచిమాట

అంటూ ఎనిమిది ఆణిముత్యాలను ఈ శీర్షికలో అందించారు. ఈనాడు సమాజంలో పెరిగిపోయిన రుగ్మత “స్వార్థం”. ఈ స్వార్థం వల్ల ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ఈ శతకంలో ఈ శీర్షికలో ఒకే ఒక్క పద్యాన్ని అందించారు. ఈ స్వార్థమే అన్ని అనర్థాలను కలుగ జేస్తుందని శక్తివంతమైన పద్యాన్ని వ్రాశారు.

స్వార్థమొకటియున్న - సకలంబు చెరచును
స్వార్థమొకటి విడువ - సర్వమబ్బు
స్వార్థమందునెంత - స్వారస్యమున్నదో
మరువబోకు మీవు - మంచిమాట

“మాటలో మాణిక్యాలు” అన్న శీర్షికలో మాటకున్న శక్తిని, దానివల్ల సమాజంలో పొందే గౌరవాగౌరవాలను, మాటను మితంగా, హితంగా, స్మితంగా

వాడుకోవాలని దాని ద్వారానే లోకంలో కీర్తి గడించుకొంటావని ఇందులో మాణిక్యాల వంటి పద్యాలను మణిదీపాలుగా మలిచారు.

బాణమేయనదియు - ప్రక్కకు పోవచ్చు
మాటవిడువనదియు - మదినిజొచ్చు
మాటలాడునపుడు - మంచిగా యోచించు
మరువబోకు మీవు - మంచిమాట

ఎలాంటి మాటను స్వీకరిస్తారో తెలుపుతూ

మధురమైన మాట - మరువక మాటాడు
మంచి పంచిపెట్టు - మానవులకు
ఇట్టులున్న నిన్ను - నింపుగా పొగిడేరు
మరువబోకు మీవు - మంచిమాట

సోమరితనము మనిషికి ఉండకూడదని, సోమరితనముంటే ఎలాంటి అభ్యుదయాన్ని సాధించలేడని, ఆ సోమరితనముంటే చాలు మిగతా అవగుణాలన్నీ చేరుతాయని చెప్పారు. సోమరితనం వదలుకోవాలని తట్టి చెప్పారు, కొట్టి చెప్పారు, మొట్టి చెప్పారు. కవిగారు నిత్య పరిశ్రమ జీవి గనుక సోమరితనమంటే వారికెంత కోపమో ఇందులో పద్యాలవల్ల తెలుస్తుంది.

సోమరత్వమొకటి - సొంపుగ నీకున్న
చెడ్డగుణములన్ని - చేరు నిన్ను
అపుడు జనులు నిన్ను - అధమాధముండంద్రు
మరువబోకు మీకు - మంచిమాట

సమయ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ సమయాన్ని సద్వినియోగం చేయువాడే జీవితంలో విజయుడవుతాడని, లోకంలో దేనినైనా తిరిగి సాధించుకోవచ్చుని జారిన సమయాన్ని మాత్రం తిరిగి పొందలేడని, సమయము యొక్క గొప్పతనాన్ని తెలుసుకొని వాడుకోవాలని హితవు పలికారు.

అనుదినంబు వార్త - లన్నియు చదివియు
చేయకల్గుదేమి - చెడునుటయము
సమయ మహిమ నెరిగి - చక్కగా వర్ధిల్లు
మరువబోకు మీవు - మంచిమాట

అంటూ కాలజ్ఞాన మహిమను తెలిపారు. ఈ రకంగా శ్రీ జనార్దన స్వామి వారు ఈనాటి విద్యార్థులకు ఉపయోగకరమైన మంచి విలువలు కల్గిన ద్విశతి అందించారు. ఈ కవిగారి నుండి మరిన్ని రసవంతమైన రచనలు రావాలని, వారి ప్రతిభా కేదారము నుండి మరిన్ని రస రాజనాలను అందించాలని సాహిత్య ప్రేమికుడిగా నేను కోరుకుంటున్నాను.

సాహితీ సేవకుడు
**డా॥ ఆచార్య వేణు**
ప్రధానోపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల
బోరబండ, హైదరాబాద్.

## "దొరకునా ఇటువంటి సేవ"

భారతంబు చదువ - పరిఢవిల్లును బుద్ధి
భాగవతము చదువ - భక్తి కలుగు
గీత చదువ - నీదు గీతను మార్చును
మరువబోకు మీవు - మంచి మాట

భగవంతుని అనుగ్రహంతో మిత్రులు శ్రీ సన్నిధి జనార్దన స్వామి గారి రచన "మరువబోకు మీవు మంచిమాట" చదివే భాగ్యం, విశ్లేషించే ప్రాప్తి లభించింది. నా అభిప్రాయంగా రెండు మాటలు.

"అగాధమౌ జలనిధిలోన ఆణిముత్యమున్నటులే" అన్నట్లుగా జీవితాన్ని లోతుగా అధ్యయనం చేయగలిగిన వారు ప్రపంచానికెన్నో విలువైన సందేశాలు అందించ గలుగుతారు. అవి అనుభవ వాక్యాలు కావటం వల్ల, అనుష్ఠానంలో వ్యక్తిగత, సామాజిక జీవితంపై వాటి ప్రభావం సంస్కారవంతమైన మార్పుకు దోహదం చేయగలవు.

చిన్న చిన్న మాటలతో పెద్ద పెద్ద భావాలను పొందు పరచిన ఈ పద్య కావ్యంలో నిత్యం మననం చేసుకొని ఆచరించడానికి ప్రేరణ యిచ్చే ఆణిముత్యాలు ఎన్నో ఉన్నాయి. ఆచరించే వారి జీవితాన్ని సంస్కార యుక్తంగా, సౌందర్య భరితంగా మార్చ గల వనటంలో సందేహం లేదు.

మానవజాతి సామాజిక, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విలువలను సూత్ర ప్రాయంగా తెలియ చేసిన ఈ ప్రయత్నం నేటి సమాజానికి ఎంతో అవసరం. నేటి ఉరుకుల పరుగుల జీవితాలలో కొంతైన మార్పుకు సాధన చేద్దామనుకున్న వారికి కరతలా మలకం ఈ మంచి మాటల కూర్పు.

మంచిని పెంపొందించుకొని పది మందికి పంచటంలో మానవత్వానికి సార్థకం చేకూరుతుంది. సంస్కారవంతమైన భావి జీవితానికి బాల్యంలోనే బీజం పడాలి. తల్లిదండ్రుల, గురువుల విశిష్టతను గుర్తించి వారిని సేవించటం మానవ జీవితానికి ప్రథమ కర్తవ్యం కావాలి. తల్లిదండ్రుల గురువుల ఔన్నత్యాన్ని గుర్తింప జేయడానికి ఈ చిన్న పుస్తకంలో పెద్ద పీటవేసిన శ్రీ

జనార్ధన స్వామి గారి కృషి ప్రశంసనీయమైనది.

మనిషి జీవితంలో మంచి వారి స్నేహం ఎంతో విలువైనది. ఈ సందర్భంగా చేసిన శ్రీ కృష్ణ కుచేల మైత్రి ప్రస్తావన ఎంతో స్మరించ తగినది, హృదయాన్ని ఆకట్టు కోగలది.

మంచి వారితో మైత్రి ఎంత మంచిదో దుర్జన సాంగత్యం అంత హానికరం అని పలు చోట్ల సూటిగా చెప్పడం జరిగింది.మనిషి జీవితం మానసికంగా, వాచకంగా, కాయికంగా సంస్కరింపబడాలి. ఈ సాధనలో కాలం యొక్క విలువను గుర్తించి పట్టుకోవలసిన సుగుణాలను సాధించి నిలబెట్టుకోవాలి. దుర్గుణాలను వదలాలి. దీనికి విచక్షణ చాలా అవసరం.

ఆలోచించి ఆచరించే వ్యక్తికి ప్రతి పద్యం మనిషిని మంచితనం వైపు ప్రోత్సహించి మార్చగల మహత్తర శక్తివంతమైనదే. ఇందులోని అంశాలు అర్థం చేసుకుంటే జ్ఞానం, అనుభవిస్తే ఆనందము-శాంతి జీవితంలో సాక్షాత్కరిస్తాయి.

కామక్రోధాలు కనులను కప్పివేసినప్పుడు లోభమోహాదులు ---- లోబరుచుకున్న -- మాత్సర్యములు మన మదిని దోచినప్పుడు ఒక్కసారి ఈ మంచి మాటలలో మననం చేసుకుంటే అవి మనకు కవచంగా పని చేసి, జీవితాన్ని సంస్కరించి రక్షిస్తాయి.

పాపభీతి, సంఘనీతి, దైవ ప్రీతి మొదలయిన వాని ప్రాముఖ్యత హృదయాన్ని ఆకట్టుకునే రీతిలో, ఉదహరించబడ్డాయి. నైతిక పునాదులతో, విద్యార్థి విద్యార్థినులు ఉత్తమ భావి పౌరులుగా రూపుదిద్దుకోవాలనే ఆశయం, విద్యా వైభవం, విశిష్టత, ఆత్మస్తుతి పరనిందను గర్హించడం, ధర్మంగా సంపాదించి ధార్మికంగా ఖర్చుపెట్టడంలోని ఔన్నత్యం, అనుకూల దాంపత్యం విలువ, నీతి నియమాల అవసరం, స్వార్థరహిత సత్కర్మలను ప్రేరణ, కామినీ కాంచనముల ప్రాబల్యం, కోరికల అదుపు, ఇంద్రియ నియంత్రణ, భారత భాగవతాది ఆధ్యాత్మిక గ్రంథాల ప్రాశస్త్యం - ఒకటేమిటి నేటి సమాజ మనుగడకు రచయిత స్పర్శించని అంశమే లేదని నాకనిపిస్తున్నది.

సెలయేటి జలంలా సహజ నిర్మలమైన ఈ సందేశాలు వ్యక్తిలోని అహంకార, అభిమాన మమకారాలను త్రుంచివేసి, దుర్గుణాలకు శస్త్ర చికిత్స, సద్గుణాల స్థాపన జరిపించి, శీలాన్ని పోషించి, మనిషి యొక్క అంతరంగిత దృష్టికి ఆలంబనమై జీవితాన్ని శ్రేయో మార్గంలో నడిపించగలదు.

అంతేకాదు భాషలో మృదుత్వం, పటుత్వం భావనలో విశిష్టత మేళవించిన ఈ సుభాషితాలు, పవిత్రమైన భారతీయ సంస్కృతి పట్ల, పావన వాఙ్మయం పట్ల, మానవ జీవిత లక్ష్యమైన ఆత్మ సాక్షాత్కారం దానిని దోహదం చేసే కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యాది విషయాల పట్ల జాగృతం చేయగలవని ఆశిస్తున్నాను.

మంచితనాన్ని బలహీనంగా భావించే ఈ రోజుల్లో సైతం, మంచి మాటలను పునః పునః బోధించడం విజ్ఞుల ధర్మం. "మరువబోకుమీవు మంచి మాట" అనే మకుటంతో సాగిన ఈ పద్య ప్రవాహం పాఠకులలో అడుగడుగునా చెడు వదలి మంచిని పెంపొందించుకోమనే హెచ్చరికతో మన వెన్నుదట్టి ప్రోత్సహిస్తున్న మిత్ర వాక్యాలు. తాను కని, విని, గ్రహించి, అనుభవించిన సత్యాలకు, స్వార్థరహితంగా పరణితం కోరి పంచిపెట్టిన ఆణిముత్యాలు. నిత్యం పఠనం చేసి సాధన చేసే వారికి సన్నిధి జనార్ధన స్వామి గారి ఈ రచన పెన్నిధియై రాణించగలదు.

"మంచి మాట తెల్పి - మార్పును కోరెద" అన్న రచయిత వాంఛ నెరవేరాలని భగవంతుని ప్రార్థిస్తూ, నా స్పందనకు అక్షరాకృతికి అవకాశమిచ్చిన మిత్రులు శ్రీ జనార్దన స్వామి గారికి కృతజ్ఞతలతో..

కొప్పరపు అచ్యుతరావు
మనో వికాస్ ఆశ్రమం, వనస్థలిపురం.

# "రచయిత గురించి క్లుప్తంగా పరిచయము"

**ఎమ్. యల్లారెడ్డి**
కర్లకుంట (గ్రా), కర్నూల్ (జి)

శ్రీమాన్ కీ॥శే॥ క్రిష్ణమాచార్యులు, శ్రీమతి క్రిష్ణమ్మ గారల దశమ సంతానము శ్రీమాన్ సన్నిధి జనార్దనస్వామి గారు. వీరు జన్మించే సమయంలో వీరి తండ్రి భగవధ్యానంలో ఉండి "ప్రథమం తు హరిం----- దశమంతు జనార్దన".. అనే శ్లోకం చదువుతూ "ఈ దశమ సంతానం పురుష సంతానమైతే "జనార్దన స్వామి" అని పేరు పెట్టాలని ముందే నిర్ణయించుకొని నామకరణం చేశారు.

వీరు తండ్రి వద్ద జ్యోతిషము, ఛందస్సు, వ్యాకరణము, పురాణాలు అభ్యసించడము జరిగినది. ఆ రోజుల్లో వీరు పాఠశాలకు వెళ్లి చదువలేదు, అయినప్పటికీ తండ్రి నేర్పిన విద్యను ఆధారం చేసుకొని స్వశక్తితో "తెలుగు సాహిత్య విశారద" పరీక్ష వ్రాసి పట్టా పొందారు.

**1-03-1967**లో శ్రీమతి కోకిల వేణమ్మ గారితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె. వీరి అల్లుడు గారు శ్రీ దత్తపీఠానికి అధిపతిగా ఉన్నారు. వీరి కుమారుడు "తెలుగు పండిత శిక్షణ" పూర్తి చేసి, ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నారు. వీరికి **2008**లో వివాహం జరిగినది.

వీరి జీవితంలోని కొన్ని మధుర క్షణాలు

1. **1972**లో గౌ॥ నందమూరి తారక రామా గారికి శుభాకాంక్షలు తెల్పుతూ పద్యాలు వ్రాసి, వారిచే ప్రశంసలు అందుకొన్నారు.
2. **1983**లో మా స్వగ్రామం కర్లకుంటలో "భగవద్గీత, భాగవతం, రామాయణము"లపై ఒక సంవత్సరం పాటు నిరంతరాయంగా ధార్మిక ప్రవచనాలు చేశారు.
3. **1983**లో శతావధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మ గారిచే అష్టావధానం చేయించారు. "కార్యక్రమ నిర్వహణ విధానము, విజ్ఞులైన పృచ్ఛకులను "గమనించిన శ్రీ శర్మ గారు" ఈ అవధానం నా జీవితంలో మరచినా

మరుపురాని మధురానుభూతి నిచ్చిందని ప్రశంసించారు.

4. **1995**లో శతావధాని శ్రీమాన్ గండ్లూరి దత్తాత్రేయ శర్మ గారిచే "ధర్మ ప్రచారకులు" అనే బిరుదు పొందారు.
5. **1995**లో ఎన్.జీ.వోస్ కాలనీలోని "రిటైర్డ్ ప్రభుత్వోద్యోగుల సంక్షేమ సంఘం"లో కొన్ని నెలలపాటు ధార్మికోపన్యాసాలు చేశారు. వీరి ప్రతిభను ముందుగా గుర్తించిన వారు వీరేనట.
6. **1996-1998** సం॥ల మధ్యకాలంలో అప్పటి న్యాయశాఖామాత్యులు శ్రీ చంద్రశేఖర్ గారి నుండి మరియు క్రీడల శాఖామాత్యులు శ్రీ రాములు గారి నుండి మరియు డి ఐ జి గోపీనాథరెడ్డి గారి నుండి సన్మానాలు పొందారు.
7. **1998**వ సం॥లో నాగఫణిశర్మ గారి ద్విసహస్రావధానంలో "వర్ణన" అనే అంశంలో పృచ్ఛకునిగా పాల్గొన్నారు.
8. వనస్థలిపురంలో గల ఎన్.జీ.వోస్ కాలనీలో గణేష్ దేవాలయములో **40** రోజుల పాటు భాగవతంపై మరో **40** రోజుల పాటు రామాయణంపై ఉపన్యసించి ప్రముఖుల ప్రశంసలు అందుకొన్నారు.
9. "విపంచి" అనే మాస పత్రికలో "రామాయణంలో రహస్యాలు రసమయం" అనే శీర్షికతో **9** నెలల పాటు వ్యాస పరంపర కొనసాగించారు.
10. చినజీయర్ స్వామి వారికి "ద్రావిడవేదం"లో గురువులు అయిన శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు గారితో కలసి ఒకే వేదికపై ఉపన్యసించారు యాదగిరిగుట్టలో.
11. త్యాగరాయ గానసభలో రామాయణంపై ఉపన్యసించి పలువురు ప్రముఖుల ప్రశంసలు అందుకొన్నారు.
12. శ్రీ వైష్ణవ సమాచార పత్రికలో "శ్రీ మద్భగవద్గీతామృతపానము - భవసాగర తీరము" అనే శీర్షికతో **58** నెలలు వ్యాసాన్ని అందించారు, అందిస్తున్నారు.

13. ఇంకా అనేక పుస్తకాలకు అభిప్రాయాలు వ్రాశారు. ఎన్నో పత్రికలకు వ్యాసాలు వ్రాశారు. జ్యోతిష, వాస్తు శాస్త్ర పండితులుగా రాణిస్తున్నారు.

14. దూరదర్శన్‌లో విద్యార్థుల బాల్యం, విద్యాభ్యాసం, స్నేహం అనే అంశాలపై **3** సార్లు ఉపన్యసించారు. వీరి ఉపన్యాసాలు రేడియోలోనూ ప్రసారమయ్యాయి.

టి.టి.డి. దేవస్థానం వారి ధర్మప్రచార పరిషత్ కర్నూలు శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక కార్యక్రమాలలో పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు.

శ్రీమాన్ సన్నిధి జనార్ధన స్వామి గారు తన జీవిత అనుభవాన్ని, నిజ జీవితంలోని వాస్తవాలను అద్దం పడుతూ వ్రాసిన “మంచిమాట దీని మరువబోకు” అన్న “ద్విశతి” చాలా అద్భుతంగా ఉన్నది. ఈ రచనా ప్రచురణకు ముందుకు వచ్చిన గౌ॥ శ్రీమాన్ చెరుకూరి రామారావు గారి సాహిత్య, సామాజిక సేవ ప్రశంసనీయము. “బంగారు ఆభరణంలో వజ్రాన్ని పొదుగుట వల్ల” ఆభరణం వల్ల వజ్రానికి, వజ్రం వల్ల ఆభరణానికి వన్నె వచ్చినట్లు, మంచి రచయితలకు ఓ మంచి ప్రచురణకర్త లభించడం కూడా ఓ అదృష్టం. వీరిరువురి నుండి మరెన్నో సేవలు సమాజానికి అందాలని ఆకాంక్షిస్తూ, వీరికి భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్య సౌభాగ్యభోగాలను అందించాలని ప్రార్థిస్తూ, శలవు తీసుకొంటున్నాను.

ఇట్లు
స్వామి గారి బాల్య మిత్రుడు
**ఎమ్. యల్లా రెడ్డి**
కర్లకుంట గ్రామం, క్రిష్ణగిరి (మం), కర్నూలు (జి)

# ఓం శ్రీ సాయిరామ్

సన్నిధి జనార్ధన స్వామి గారు వ్రాసిన "మరువబోకు మీవు మంచిమాట" అను పద్యముల సంపుటి చదివి అవి ఎంతో ఈ సమాజానికి చాలా విషయములలో "మేలుకొలుపు"లా ఉన్నవి, ఈ సమాజము దీనిని చదివి ఆచరించ కలిగినట్లయితే ఎందరికో ఎన్నో రకాలుగా ఉపయోగ పడును. నాకు మాత్రము ఈ పద్యములు చదివిన వెంటనే అందరికి ఉపయోగ పడాలనే తపనతో ముద్రించటకు స్వయముగా అంగీకరించితిని. మంచిని పంచటము అనేది నిరంతర ప్రక్రియ, ఎవరో ఒకరు జనార్ధన స్వామి లాంటి వారు రచించిన "మరువబోకు మీవు మంచిమాట" లాంటి అమృత సంపదను నలుగురికి పంచవలసిన అవసరము ఉన్నది, ఆ బాధ్యతను నేను స్వీకరించవలె ననుకున్నాను. ఇలాంటి సాహిత్యము ప్రతి రోజు నెమరు వేయవలసిన అవసరము ఉన్నది. ఇవి చదువుచున్నంత సేపు ఒక రకమైన ప్రశాంతత కలుగుచున్నట్లు అనిపిస్తుంది. అదే ఉద్దేశముతో ఇది వరలో బాల బాలికలలో నైతిక విలువలు పెరగాలని "గాంధీమార్గం", "సాయిదేశం – గాంధీమార్గం", "బాలనీతి విద్యామృతము" మొదలగు పుస్తకములు కూడ ముద్రించే బాధ్యతను వహించితిని. ఇలాంటి ప్రచురణల ద్వారా లోక కళ్యాణము జరుగునని నా అభిప్రాయము.

చివరగా ఇలాంటి పుస్తకములు భవిష్యత్తులో ఇంకా మరెన్నో రచనలు చేయాలని, స్వామి గార్కి భగవంతుడు ఆయువు మరియు ఆరోగ్యము మరియు ఐశ్వర్యము కలుగ చేయాలని ఆ భగవంతుని ఎల్లవేళల నేను ప్రార్థిస్తు ముగిస్తున్నాను.

**చెరుకూరి రామారావు**

ఛైర్మన్, చెరుకూరి గ్రూప్

వనస్థలిపురం, హైదరాబాద్. ఫోన్ – **93467 87777, 98853 00777**

ఓం శ్రీ శారదా గురుభ్యోనమః
శ్రీ రామచంద్ర పరబ్రహ్మణేన్నమః

# మరువబోకు మీవు - మంచిమాట

ఆ.వె॥ శ్రీయుశుభముకలిమి - శ్రీ లక్ష్మి ప్రభువీయ
మంచిమిత్రసమితి - మహినికలిగి
మంచిమార్గమందు - మరువకనడువుడీ
మరువబోకుమీవు - మంచిమాట 1

ఆ.వె॥ కవినటంచునేను - కవిత వ్రాయుట లేదు
పండితుడనటంచు - పలుకలేదు
మంచిమాటతెల్పి - మార్పును కోరెద
మరువబోకు మీవు - మంచిమాట 2

## తల్లిదండ్రులు - వారి ఔన్నత్యము

ఆ.వె॥ తల్లిపాలనిచ్చి - తనువును పెంచియు
చావుబ్రతుకు మధ్య - జన్మమిచ్చు
తల్లిసేవచేయ - ధర్మమునీకెప్డు
మరువబోకు మీవు - మంచిమాట 3

ఆ.వె॥ విద్దె బుద్ధి నేర్పి - విలువలు తెల్పియు
ప్రేమతోడ పెంచి - పెద్దజేసి
నీదు మేలు గోరు - నీ తండ్రి బూజించు
మరువబోకు మీవు - మంచిమాట 4

ఆ.వె॥ తల్లితండ్రి గురువు - దైవసమానులు
ధర్మమెరిగి - దాని తత్వమెరిగి
భక్తితోడవారి - భజియింపుమెప్పుడు
మరువబోకు మీవు - మంచిమాట 5

ఆ.వె॥ తండ్రి సేవ చేయు - తన యుండె తనయుండు
సానుకూలమైన - సతియె సతియు
మేలుగోరు నట్టి - మిత్రుండె మిత్రుండు
మరువబోకు మీవు - మంచిమాట 6

ఆ.వె॥ తల్లితండ్రి సేవ - తప్పక చేయుము
అట్లు సేవచేసి - ఆర్యుడైన
పుండరీకుడెంతొ - పుణ్యంబుగనలేద
మరువబోకు మీవు - మంచిమాట 7

ఆ.వె॥ తాత తండ్రి పేరు - తనయులు చెడగొట్టు
కంటె మహిని కీడు - కలుగబోదు
వంశకీర్తిజెరచు - వారలు వీరలు
మరువబోకు మీవు - మంచిమాట 8

ఆ.వె॥ కలియుగంబునందు - కనపడుదేవతల్
తల్లితండ్రులంచు - తలపు మెపుడు
వారి సేవజేసి - వర్ధిల్లుమెప్పుడు
మరువబోకు మీవు - మంచిమాట 9

ఆ.వె॥ మహిని జన్మమిచ్చి - మంచికోరినవారి
కఠిన భాష లాడి - కరువ బోకు
వారుబాధపడిన - వర్ధిల్లవెప్పుడు
మరువబోకు మీవు - మంచిమాట 10

ఆ.వె॥ మంచి పుత్రుడొకడు - మహియందుకల్గిన
తండ్రిపేరు పెంచు - తప్పకుండ
చంద్రుడొకడు రాత్రి - శ్రేష్ఠతకూర్చుడే
మరువబోకు మీవు - మంచిమాట 11

ఆ.వె॥ మహిని పేరు తెచ్చు - మంచి పుత్రుండును
కవిత వలన వచ్చు - ఖ్యాతిగాని
పూర్వజన్మచేయు - పుణ్యాల వల్లనే
మరువబోకు మీవు - మంచిమాట 12

ఆ.వె॥ తల్లితండ్రి గురువు - దనరంగపూజించి
అన్ని ధర్మములను - ఆచరింప
మనుషులందువాని - మాధవుండనవచ్చు
మరువబోకు మీవు - మంచిమాట 13

ఆ.వె॥ భూమికన్న గొప్ప - భువియందు తల్లియే
ఆ కసమునకన్న - అధికుడరయ
తండ్రియంచుమదిని - తప్పక గ్రహియింపు
మరువబోకు మీవు - మంచిమాట 14

ఆ.వె॥ తల్లితండ్రి భార్య - తనయుల మిత్రుల
విడుచువాడుభువిని - విఫలుడగును
అట్టివాడునిక్క - మత్యంత యధముండు
మరువబోకు మీవు - మంచిమాట 15

ఆ.వె॥ తల్లితండ్రి గురువు - దనరంగ వీరలు
దేహమిచ్చిబుద్ధి - తేజమివ్వ
వారిమరచు వాడు - వసుధలోపశువౌను
మరువబోకు మీవు - మంచిమాట 16

## నీతినియమాలు

ఆ.వె॥ మనుజ జన్మనీకు - మరలను రాబోదు
ఇపుడె దాని గూర్చి - యెరుగు మోయి

దైవసేవతోడ - తరియింపవలెనంచు
మరువబోకు మీవు - మంచిమాట 17

ఆ.వె॥ కఠినమనసువీడి - కరుణార్ద్రహృదయుడై
మారకున్న నీకు - మహినిలేవు
శాంతిసుఖముతృప్తి - సౌఖ్యంబులన్నియు
మరువబోకు మీవు - మంచిమాట 18

ఆ.వె॥ మంచిచెలిమి ఎపుడు - మానకచేయుము
చెడ్డవారిమైత్రి - చేటుతెచ్చు
చెప్పిరార్యులెల్ల - శ్రేష్ఠగుణాలుగా
మరువబోకు మీవు - మంచిమాట 19

ఆ.వె॥ ధర్మమార్గమందు - ధనము సంపాదించు
అందుతృప్తి సుఖము - లబ్బునీకు
వక్రమార్గమందు - వచ్చినా నిల్వదు
మరువబోకు మీవు - మంచిమాట 20

ఆ.వె॥ ధనము విద్యరూపు - దనకు కల్గిన దంచు
మిడిసిపడెడు వారు - మిక్కుటముగ
పతనమగుదురెపుడు - పరిపరి విధముల
మరువబోకు మీవు - మంచిమాట 21

ఆ.వె॥ చెప్పువారలెపుడు - చేయరు పనులను
చేయువారలెపుడు - చెప్పబోరు
చెప్పుకొనెడుకంటె - చేయుటేమంచిది
మరువబోకు మీవు - మంచిమాట 22

ఆ.వె॥ చిన్ననాటిచదువు - చెడదెన్నడేనియు
ఉన్నతోన్నతమది - ఉర్వియందు
అట్లు విద్యనేర్చి - ఆనంద మందుమా
మరువబోకు మీవు - మంచిమాట 23

ఆ.వె॥ మ్రొక్కియొకడుతాను - మ్రొక్కించుకొనుచుండు
తిట్టినొకడు, తాను - తిట్లు తినును
కొట్టు నొకడు, తాను - కొట్టించుకొనుచుండు
మరువబోకు మీవు - మంచిమాట 24

ఆ.వె॥ బాల్యమందెమంచి - పద్ధతుల్ నేర్పుడీ
వయసువచ్చినంత - వలనుపడదు
మొక్కవంగినట్లు - మానైన వంగునా
మరువబోకు మీవు - మంచిమాట 25

ఆ.వె॥ మంచికోరుమిత్ర - మండలిలేకున్న
మధురవాక్కులేక - మసలుచున్న
అతనికంటె పశువు - లవనియందునమేలు
మరువబోకు మీవు - మంచిమాట 26

ఆ.వె॥ చిన్ననాడు చెలిమి - చేసి కుచేలుని
కృష్ణుడతని విస్మరించలేదు
వారి వలెను నీవు - వసుధను మెలగుమా
మరువబోకు మీవు - మంచిమాట 27

ఆ.వె॥ చిన్ననాటిచెలిమి - ఛేదించిద్రోణుని
తూలనాడెనౌర - ద్రుపదుడపుడు
పిన్నవానిచేత - పీడింపబడలేదె
మరువబోకు మీవు - మంచిమాట 28

ఆ.వె॥ ఎదుటివారి తప్పు - లెప్పుడు వెదుకును
మంచివానినెపుడు - కాంచబోడు
దుష్టుడైన తనకు - దుష్టులేజనులెల్ల
మరువబోకు మీవు - మంచిమాట 29

ఆ.వె॥ సుజన మైత్రిచేసి - సుఖములుగనవలె
పాపితోడిమైత్రి - పాము చెలిమి
మంచిచెడులు తెలిసి - మసలుటే మంచిది
మరువబోకు మీవు - మంచిమాట 30

ఆ.వె॥ దుష్టమైత్రిచేయ - దుష్టుడుతానౌను
కర్ణుడటులచేసి - కడకుచచ్చె
మంచిచెలిమి యెపుడు - మానక చేయుము
మరువబోకు మీవు - మంచిమాట 31

ఆ.వె॥ విద్యకలిగియుండి - వినయంబులేకున్న
జనులు మెచ్చరెవరు - జగతియందు
విద్యలేకయున్న - వినయంబుచాలదా
మరువబోకు మీవు - మంచిమాట 32

ఆ.వె॥ పరులమేలుగోరు - పావనజన్మంబు
పరులకీడుచేయు - పాడుజన్మ
మేలుకీడుతెలిసి - మెలగుటే జ్ఞానంబు
మరువబోకు మీవు - మంచిమాట 33

ఆ.వె॥ ధనముపోవమరల - దండిగా తేవచ్చు
ఘడియపోయెనేని - కాంచలేవు
సమయపువిలువెరిగి - చక్కగా జీవించు
మరువబోకు మీవు - మంచిమాట 34

ఆ.వె॥ మూర్ఖుతోడిమైత్రి - ముప్పును తెచ్చును
మూర్ఖుతోడి పగయు - ముదముగాదు
అగ్గిబొగ్గుఓలె - అంటరాదెప్పుడు
మరువబోకు మీవు - మంచిమాట 35

ఆ.వె॥ నోరుమంచిదైన - నూరుమంచిదియండ్రు
మంచిమాటలాడి - మంచిపేరు
పొందియుర్వియందు - పొలుపొందవలెగాదె
మరువబోకు మీవు - మంచిమాట 36

ఆ.వె॥ అన్నదానమొకటె - అధికంబు భువియందు
సత్యమెపుడు పల్కు - సంతతంబు
వినయగుణముగల్గ - విజ్ఞులు మెత్తురు
మరువబోకు మీవు - మంచిమాట 37

ఆ.వె॥ కపటబుద్ధితోడ - కల్లలుమాటాడి
మోసపుచ్చగలడు - మూర్ఖుడిలను
వానిబ్రతుకునెపుడొ - వల్లకాడుగమారు
మరువబోకు మీవు - మంచిమాట 38

ఆ.వె॥ మనసునందు విషము - మాటలందునతీపు
చేతలందునొకటి - చెప్పునొకటి
అంతకంటె పాపి - అవనియందునలేడు
మరువబోకు మీవు - మంచిమాట 39

ఆ.వె॥ ప్రజ్ఞకల్గువాని - బాలకుండైనను
గారవమునవాని - గాంచవలయు
బుద్ధిలేనివాని - పెద్దనియందురా
మరువబోకు మీవు - మంచిమాట 40

ఆ.వె॥ చెడ్డపేరు నీకు - క్షణములో వచ్చును
వచ్చుపేరుపోదు - చచ్చువరకు
నీవుపోవనిలుచు - నీకీర్తిభువియందు
మరువబోకు మీవు - మంచిమాట 41

ఆ.వె॥ స్వార్థమొకటియున్న - సకలంబుచెరచును
స్వార్థమొకటివిడువ - సర్వమబ్బు
స్వార్థమందునెంత - స్వారస్యమున్నదో
మరువబోకు మీవు - మంచిమాట 42

ఆ.వె॥ సుజనసంగమంబు - సుగతికల్గించును
కుజనసంగమంబు - కూల్చునిన్ను
సుజనకుజన విలువ - సుంతైన తెలియుము!
మరువబోకు మీవు - మంచిమాట 43

ఆ.వె॥ మంచిమాటయందు - మాధుర్యమున్నది
మంచిమాటయందు - మహిమ గలదు
మంచిమాటవినిన - మాన్యుడుతానౌను
మరువబోకు మీవు - మంచిమాట 44

ఆ.వె॥ బీదవాడనంచు - బిడియంబుపడబోకు
ధనము గలుగు వారి తలపబోకు
కలిమిలేములెపుడు - కలకాలముండవు
మరువబోకు మీవు - మంచిమాట 45

ఆ.వె॥ "తప్పులేనివాడ" - తాననుకొనుటయే
తప్పులందునదియె - గొప్పతప్పు
తనదుతప్పుతెలిసి - తరియింపవలెనెప్డు
మరువబోకు మీవు - మంచిమాట 46

ఆ.వె॥ కటువు పలుకులెపుడు - కత్తిదెబ్బన వచ్చు
కఠినవాక్కు పలుక - కాంతితొలగు
మంచి మాటలాడి - మన్నన పొందుమా
మరువబోకు మీవు - మంచిమాట 47

ఆ.వె॥ చేయరానిపనులు - చేసిన యట్టైన
పడగరానిపాట్లు - పడగవలయు
పాడుపనులుచేసి - పరితపించుటయేల
మరువబోకు మీవు - మంచిమాట 48

ఆ.వె॥ అడుగదగినవారి - నడిగిన ఫలమబ్బు
బడుగునడిగెనేని - బాధగలుగు
అర్థిజనులజూచి - అపహాస్యములుజేయు
మరువబోకు మీవు - మంచిమాట 49

ఆ.వె॥ అన్నదమ్ములక్క - లతిథుల పెద్దల
గారవించలేని - కఠినవ్యక్తి
పరులకేమి మేలు - పంచునుభువియందు
మరువబోకు మీవు - మంచిమాట 50

ఆ.వె॥ బురదచల్లబోకు - బుద్ధిమంతుడవీ వు
తగులకుండవార్కి - తప్పవచ్చు
చేతికంటునీకు - చెడ్డయౌబురదంత
మరువబోకు మీవు - మంచిమాట 51

ఆ.వె॥ జీవితమును బాగు - జేయగల్గినయట్టి
మంచిసాధనంబు - మహినివిద్య
మంచిస్నేహితంబు - మహియందుకూర్చుకో
మరువబోకు మీవు - మంచిమాట 52

ఆ.వె॥ మిత్రజనుడు తాను - శత్రువై నిల్చిన
మిగుల కష్టమగును - మీకు నెపుడు
శత్రుశత్రువైన - జరుగదుచేటెప్డు
మరువబోకు మీవు - మంచిమాట 53

ఆ.వె॥ ఎంతకష్టమున్న - ఎన్నియాపదలున్న
దుష్టసాయమడగ - తుదకుకీడు
అధికకష్టనష్ట - మాపదపాల్జేయు
మరువబోకు మీవు - మంచిమాట 54

ఆ.వె॥ పాడుపడినయింట - పండుట దోషంబు
పాముతోటిచెలిమి - పరగకీడు
హీనజనులచెలిమి - హీనునిచేయదా
మరువబోకు మీవు - మంచిమాట 55

ఆ.వె॥ ఒకనినోరుకొట్టి - ఒద్దికభుజియింప
వానినోరుకొట్టు - వనజభవుడు
తాటిదన్నువాని - తలదన్నువాడుండు
మరువబోకు మీవు - మంచిమాట 56

ఆ.వె॥ ఎడ్డెవానిచెలిమి - ఎప్పుడు చేయకు
అధికునధము చెలిమి - కగును ముప్పు
చెలిమి పగయనెపుడు - సమకాలికులతోడ
మరువబోకు మీవు - మంచిమాట 57

ఆ.వె॥ సంపదాళిపోవ - సమకూర్చుకొనవచ్చు
మహిని ఎన్ని అయిన - మరల వచ్చు
సమయమొకటిపోవ - సమకూర్చుకొనలేవు
మరువబోకు మీవు - మంచిమాట 58

ఆ.వె॥ బ్రహ్మచర్యవ్రతము - పాటించుమెప్పుడు
ప్రాయమందుధనము - పరగకూర్చు
అట్లుచేయకున్న - అధముడౌ భువియందు
మరువబోకు మీవు - మంచిమాట 59

ఆ.వె॥ బలముగలదటంచు - భ్రాంతిచెందకునీవు
పాముబలమువలెను - పాడుగాదె
చీమలెల్లగూడి - చిత్రమ్ము! చంపవే
మరువబోకు మీవు - మంచిమాట 60

ఆ.వె॥ మంచిచేసిమరచు - మాననీయుడుభువి
మేలుబొందిమరచు - మ్లేచ్ఛుడతడు
మరపుజ్ఞప్తిమహిమ - మానకమదినెంచు
మరువబోకు మీవు - మంచిమాట 61

ఆ.వె॥ దుష్టుడైన అన్న - దుర్మతి విడనాడి
శత్రువైనరాము - శరణుజొచ్చి
ఇహపరములందు - హితుడాయెతమ్ముడు
మరువబోకు మీవు - మంచిమాట 62

ఆ.వె॥ పరులయాశ్రయమున - బ్రతికినంతనె నీకు
గౌరవంబుచెడదు - కాంతిచెడదు
వీరులైనవారు - విరటుని గొల్వరే!
మరువబోకు మీవు - మంచిమాట 63

ఆ.వె॥ తేలుకొండితోడ - తెంపుగా బాధించు
కోరతోడ పాము - కొరికి చంపు
నాల్కతోడఖలుడు - నాశనంబులుచేయు
మరువబోకు మీవు - మంచిమాట 64

ఆ.వె॥ తప్పుచేసితేని - తపియించి మరలను
దానిచేయకుంట - ధర్మపథము
తప్పుదిద్దుకొనని - తానెంతొ వ్యర్థుండు
మరువబోకు మీవు - మంచిమాట 65

ఆ.వె॥ కూడుగుడ్డలకును - కులకాంతకొరుకును
బ్రతుకు వ్యర్థపరచు - పామరుండు
మృగములన్ని బొందు - మురిపాలు నివియెగా
మరువబోకు మీవు - మంచిమాట 66

ఆ.వె॥ కలిమికల్గువేళ - కానలకేగిన
వచ్చిచేరుధనము - వదలకుండ
కలిమిలేనివేళ - కనకమ్మెమట్టియౌ
మరువబోకు మీవు - మంచిమాట 67

ఆ.వె॥ గుణముయశముచదువు - గుర్తింపుకల్గిన
పుత్రుడనుచువాని - పొగడవలయు
అట్లుకానివాడు - అపకీర్తులకునేల
మరువబోకు మీవు - మంచిమాట 68

ఆ.వె॥ విద్యనేర్చిమిగుల - వినయంబుకల్గియు
తల్లితండ్రులెంతొ - తనివిజెంద
సంతతంబు గూర్పు - సత్పుత్రయోగంబు
మరువబోకు మీవు - మంచిమాట 69

ఆ.వె॥ సాధుసంగమంబు - సకలార్థమొనకూర్చు
నీచుతోటి మైత్రి - నిజము విషము
మంచి చెడులు తెలిసి - మైత్రిని చేయుము
మరువబోకు మీవు - మంచిమాట 70

ఆ.వె॥ చేటుకాలమతని - చేయిపట్టినవేళ
మంచివారిమాట - మదికిరావు
మంచికాలమందు - మంచిమాటలెవిను
మరువబోకు మీవు - మంచిమాట 71

ఆ.వె॥ రానిదానికొరకు - రవ్వంతచింతేల
గడచినట్టి పనికి - గలభయేల
ఆపదందుమిగుల - ఆరాటపడనేల
మరువబోకు మీవు - మంచిమాట 72

ఆ.వె॥ మూతిపెట్టువాడు - మేతపెట్టందరు
మూతికంటెముందె - మేతపెట్టె
దీనినెరుగువాడు - ధీరుడు భువియందు
మరువబోకు మీవు - మంచిమాట 73

(శిశువు పుట్టకమునుపే ఆ శిశువుకు ఆహారం యేర్పాటు చేశాడు భగవంతుడు ఎట్లనగా, ఇతడు భూమిపైకి రాక మునుపే తల్లిపాలిండ్లలో పాలు ఉత్పత్తిచేసిన వాడు ఆ దయాపరుడు. నీకు తిండి యేర్పాటు చేయకుండునా)

ఆ.వె॥ బుద్ధిమంతుడిలను - ఎద్దియైనను చేయు
వీరుడైనవాడు - విఫలుడగును
బలము బుద్ధి రెండు - బాగుగా తెలుసుకో
మరువబోకు మీవు - మంచిమాట 74

ఆ.వె॥ నీచబుద్ధివాడు - నిజముగాకలహించు
సాధువర్తనుండు - సంధికోరు
వీనియందుగలుగు - విలువ నెరుంగుమా
మరువబోకు మీవు - మంచిమాట 75

ఆ.వె॥ పాపికెపుడు మేలు - పరగచేయగరాదు
సాధువులకు కీడు - చాలయఘము
వర్తనంబుతెలిసి - వర్ధిల్లుమెప్పుడు
మరువబోకు మీవు - మంచిమాట 76

ఆ.వె॥ పాప కర్మవదలి - పద్ధతుల్ తెలిసియు
మంచిమార్గమందు - మసలుమోయి
అట్లు నీవు నడువ - అందరు మెత్తురు
మరువబోకు మీవు - మంచిమాట 77

ఆ.వె॥ నేను గొప్పయంచు - నేర్పుతో పొగడగ
పతనమగుటకదియె - పరగ తప్పు
తనదు గొప్పతనము - దాచిన దాగునా
మరువబోకు మీవు - మంచిమాట 78

ఆ.వె॥ హంసనీరు వదలి - అత్యంత ప్రేమతో
పాలుత్రాగి నీరు - ప్రక్కకిడును
మంచిగొనియు నీవు - మలినంబు విడనాడు
మరువబోకు మీవు - మంచిమాట 79

ఆ.వె॥ పగటినిద్ర ఎపుడు - పనులను చెడగొట్టు
నీతిపెంచుకొనుము - నిద్రవదలి
నీతిలేకయున్న - నాతియైనను రోయు
మరువబోకు మీవు - మంచిమాట 80

ఆ.వె॥ మితము నిద్ర కలిగి - మితముగా భుజియించి
మితసుభాషణంబు - మీరబోకు
ఇవియెబ్రహ్మచారి - కింపునుచేకూర్చు
మరువబోకు మీవు - మంచిమాట 81

ఆ.వె॥ కాకదృష్టి కల్గి - కనుగొనుమెప్పుడు
జపముకొంగవలెను - సలుపుమోయి
కుక్కవలెను నిద్ర - కూర్కును పొందుమా
మరువబోకు మీవు - మంచిమాట 82

(కాకికి చాలా దురదృష్టి కలదు - నీవును కాకివలె దూరదృష్టి కలిగియుండుము. కొంగచేపకొరకు నీటి ఒడ్డున ఏకాగ్రతగా ఉండును. గురువులు చెప్పునప్పుడు నీవును ఏకాగ్రత కలిగియుండవలెను. కుక్క చాల తక్కువగా నిద్రించును. ఒకవేళ నిద్రించినా చడి అయిన వెంటనే లేచి మొరుగుతుంది. అటులనే విద్యార్థి మెలకువ కలిగి యుండవలెను. విద్యార్థి మితాహారియై ఉండుట తన భవితకు మంచిది.)

ఆ.వె॥ ఇచ్చి చచ్చెనొకడు - ఇడక చచ్చెనొకండు
అంటకుండనొకడు - అంటియొకడు
చచ్చినారు వారి - చరితనెరుంగుము
మరువబోకు మీవు - మంచిమాట 83

1. బలి చక్రవర్తి 2. దుర్యోధనుడు
3. రావణుడు 4. భస్మాసురుడు

ఆ.వె॥ విప్రులందు రాజు - వెలయద్రోణుడు భువి
రాజులందు 'వైశ్య' - రమణశకుని
శూద్రులందు ద్విజుడు - శుభుడుతావిదురుండు
మరువబోకు మీవు - మంచిమాట 84

ఆ.వె॥ భారతమున కంత - ప్రముఖుడై విలసిల్లు
జనపతులద్విజుండు - శాంతనపుడు
స్త్రీలయందు 'సాధ్వి' - స్థిరమునరుంధతి
మరువబోకు మీవు - మంచిమాట 85

ఆ.వె॥ దారపుత్రులందు - ధనమందు నెప్పుడు
పరిమితముగ మమత - పరగవలయు
తక్కువెక్కువైన - తప్పవు కష్టాలు
మరువబోకు మీవు - మంచిమాట 86

ఆ.వె॥ కఠినభాషలాడి - కర్కశహృదయుడై
కాలయమునిచేత - కష్టపడక
మధురభాషణంబు - మంచిగా మాటాడు
మరువబోకు మీవు - మంచిమాట 87

ఆ.వె॥ మంచిమాటపలుకు - మరువకనెప్పుడు
మంచిచూడు మెపుడు - మానకుండ
మధురభాషణంబు - మంచిగా మాటాడు
మరువబోకు మీవు - మంచిమాట 88

ఆ.వె॥ పెద్దవారి సేవ - పెంచును జ్ఞానంబు
పెద్దవారి సేవ - పెంచు కీర్తి
పెద్దవారి సేవ - పెంచు విజ్ఞానంబు
మరువబోకు మీవు - మంచిమాట 89

ఆ.వె॥ నాటకమ్మునందు - నయముగా నటియింప
మెప్పుపొందునతడు - మేలుగాను
జీవితముననటన - చేటుకల్గునుగాదె
మరువబోకు మీవు - మంచిమాట 90

## కామక్రోధములను గూర్చి

ఆ.వె॥ క్రోధకామములను - కూల్చుడీమీరంచు
బోధచేయుచుంద్రు - బోలెడిలను

చెప్పుట సులభంబు - చేయుటేకష్టంబు
మరువబోకు మీవు - మంచిమాట 91

ఆ.వె॥ కలనునయిన పరుల - కాంతల గోరకు
మట్లు కోరువార - లవనియందు
రావణుండువోలె - రాలిపోవుచునుంద్రు
మరువబోకు మీవు - మంచిమాట 92

ఆ.వె॥ విషయసుఖములెపుడు - వింతగా బాధించు
విషముకంటె చేటు - విషయసుఖము
విషముతిన్నచంపు - విషయాల్తినకచంపు
మరువబోకు మీవు - మంచిమాట 93

ఆ.వె॥ మోసగించునట్టి - మోహనాంగులనమ్మి
ఇహము పరము చెడియు - నిలను తాను
ధనము కీర్తి పేరు - దండిగా కోల్పోవు
మరువబోకు మీవు - మంచిమాట 94

ఆ.వె॥ కామబందమొకటి - కాటేయ వెంటనే
రావణుండుభువిని - రాలిపోయె
నీవనంగనెంత - నిక్కముతెలుసుకో
మరువబోకు మీవు - మంచిమాట 95

ఆ.వె॥ రాగబంధములను - రాలిపోయెనునాడు
దశరథుండుమిగుల - దైన్యముగను
కామరాగములను - కనిపెట్టి జీవించు
మరువబోకు మీవు - మంచిమాట 96

ఆ.వె॥ కామరోగమొంది - కఠినముగను చచ్చె
రావణుండు మునుపు - రాముచేత
కాముబారిబడక - కడతేరుమెప్పుడు
మరువబోకు మీవు - మంచిమాట 97

ఆ.వె॥ కామమంతవ్యాధి - కల్గునే భువియందు
అగ్నివంటి క్రోధ - మవని గలదె
జ్ఞానివయిన సుఖము - కలుగును భువియందు
మరువబోకు మీవు - మంచిమాట 98

ఆ.వె॥ లోభివైననీకు - లోకమే దూరమౌ
లోభమున్న శత్రు - లోకమేల
వీటివిలువ తెలియ - విబుధుడు తానౌను
మరువబోకు మీవు - మంచిమాట 99

ఆ.వె॥ కాముడున్నచోట - రాముడెట్లుండును
రాముడున్నచోట - కాముడున్నె
ధరనురాముకాము - తత్వంబు తెలియుము
మరువబోకు మీవు - మంచిమాట 100

## విద్యావైభవము

ఆ.వె॥ గొప్ప విద్యయుండి - గోప్యంగ దాచియు
బోధచేయనట్టి - పురుషులెపుడు
బ్రహ్మరాక్షసులుగ - ప్రభవింతురందురు
మరువబోకు మీవు - మంచిమాట 101

ఆ.వె॥ కవులు కనని వింత - కల్గునే భువియందు
కాంతచేయలేని - కర్మగలదె

కవులు ఋషులు కాంత - కౌగిళ్ళబందీలు
మరువబోకు మీవు - మంచిమాట 102

ఆ.వె॥ భారతంబు చదువ - పరిఢవిల్లును బుద్ధి
భాగవతము చదువ - భక్తి కలుగు
గీత చదువ - నీదుగీతను మార్చును
మరువబోకు మీవు - మంచిమాట 103

ఆ.వె॥ కోటిగ్రంథసార - గోప్యంబుతెలిపెద
పరులకుపరింప - ప్రబలకీర్తి
పాపమాచరింప - పాపివౌదువుగాదె
మరువబోకు మీవు - మంచిమాట 104

ఆ.వె॥ మధురమైనయట్టి - మానవ జన్మంబు
అబ్బెయందు విద్య - యందమిచ్చు
సుకవివయిన మిగుల - శోభిల్లు నుయశమును
మరువబోకు మీవు - మంచిమాట 105

ఆ.వె॥ ప్రజ్ఞలేని చదువు - ఫలితంబునీయదు
నీతిలేనిమాట - నిలువదెపుడు
భక్తిలేనిపూజ - ఫలియించదెప్పుడు
మరువబోకు మీవు - మంచిమాట 106

## జ్ఞాన విజ్ఞానములు

ఆ.వె॥ శాంతిలేక యెంత - సంపదయున్నను
సుఖముకల్గదెపుడు - సుంతయైన
తృప్తిలేని ధనము - తేల్చునే భువియందు
మరువబోకు మీవు - మంచిమాట 107

ఆ.వె॥ ధనము వెంటరాదు - తనువును వదలిన
మంచిచెడులు వచ్చు - మానకుండ
ధర్మమార్గమందు - తరియింప మంచిది
మరువబోకు మీవు - మంచిమాట 108

ఆ.వె॥ జ్ఞాన మార్గమందు - చరియించువారిని
మానవోత్తములని - మదినితలచు
జ్ఞానికానివాడు - కదువింతపశువండ్రు
మరువబోకు మీవు - మంచిమాట 109

ఆ.వె॥ బయటి రిపులగెల్వ - పర్వులెత్తెదు లోని
శత్రువులను గెల్వ - జాలితేని
బయటనున్న వారు - బందీలు నీకెప్డు
మరువబోకు మీవు - మంచిమాట 110

ఆ.వె॥ రామదాసు వౌచు - రంజిల్లు భువి యందు
కామదాసువౌచు - కాలిపోకు
కాలిరెందరొయిల - కడతేరిరెందరో
మరువబోకు మీవు - మంచిమాట 111

ఆ.వె॥ భార్యబిడ్డలెవరు - బంధువుల్ మిత్రులు
నీదు వెంటరారు - నిక్కముగను
పాపపుణ్యములును - పాయకవచ్చును
మరువబోకు మీవు - మంచిమాట 112

ఆ.వె॥ ధరనుయజ్ఞమొకటి - దక్షుండుగావించె
అరయచేసెయుద్ధ - మర్జునుండు
చచ్చి రొకరుశ్రేష్ఠ - చరితార్థులొక్కరు
మరువబోకు మీవు - మంచిమాట 113

తా॥ భగవంతుని నిరాకరించిన దక్షునియజ్ఞము యుద్ధమైనిది - అర్జునుని యుద్ధం యజ్ఞమైనది (భగవంతునిముందు పెట్టుకున్నందున)

ఆ.వె॥ సుత్తిదెబ్బలెన్ని - స్రుక్కించుచున్నను
మొలల దెబ్బలెన్ని - మోదబడిన
మొక్కవోకనిల్చి - మ్రొక్కులందెనుమూర్తి
మరువబోకు మీవు - మంచిమాట 114

ఆ.వె॥ పరులనిందజేయ - పాపంబు భువియందు
ఆత్మవినుతి యంత - కంటె కీడు
నీదు తప్పుతెలిసి - నీతితో నడువుము
మరువబోకు మీవు - మంచిమాట 115

ఆ.వె॥ భోగియెపుడుతాను - యోగికావలెనన్న
యోగికాడుతాను - రోగి కాని
రోగివైన నీవు - యోగివెట్లౌదువు
మరువబోకు మీవు - మంచిమాట 116

ఆ.వె॥ చావుమరువబోకు - చావక తప్పదు
చచ్చిబ్రతుకనేర్చు - చదువు చదువు
చచ్చి బ్రతుకువాడె - చక్కని విజ్ఞాని
మరువబోకు మీవు - మంచిమాట 117

ఆ.వె॥ బలము ధనము గలుగ - బంధువుల్ వత్తురు
ధనము బలము పోవ - తలపరెవరు
ఆర్తియందుబ్రోచు - ఆ హరిఒక్కడే
మరువబోకు మీవు - మంచిమాట 118

ఆ.వె॥ నిందకోర్చునతడు - నిద్రకోర్చునతండు
పొగడుచుండునపుడు - పొంగనతడు
పరమపదము పొందు - పావనుండాతడు
మరువబోకు మీవు - మంచిమాట 119

ఆ.వె॥ మట్టిమీద తిరిగి - మట్టిలోకలిసెడి
మట్టిదేహమంచు - మరువబోకు
మట్టిదేహమందు - మమతలు విడనాడు
మరువబోకు మీవు - మంచిమాట 120

ఆ.వె॥ లోకముద్ధరింప - లోకాలు తిరిగేవు
మోహజనితమైన - మోసమదియు
భక్తి రక్తి శక్తి - భావాలు తెలియుము
మరువబోకు మీవు - మంచిమాట 121

ఆ.వె॥ చేయుపుణ్యములను - చెప్పకుమెప్పుడు
చేయుపాపములను - చెప్పుమెపుడు
చెప్పతరుగుచుండు - చెలువుగరెండును
మరువబోకు మీవు - మంచిమాట 122

ఆ.వె॥ లేని మహిమలన్ని - లెక్కలు చెప్పిన
ఉన్నమహిమలన్ని - ఊడిపోవు
మహిమలున్న నిన్ను - మనుజులెరుంగరే
మరువబోకు మీవు - మంచిమాట 123

ఆ.వె॥ విద్య, ధనము, కీర్తి - విరివిగా ఉన్నను
బంధు మిత్రజనులు - ప్రక్కనున్న
మరణకాలమందు - మహినిరక్షింతురె
మరువబోకు మీవు - మంచిమాట 124

ఆ.వె॥ ఏదిన్యాయమనుచు - ఎంతురు పెద్దలు
ఏదిలాభమనుచు - ఎంచుపాపి
పాపిబుధులనరసి - పద్ధతికనుగొను
మరువబోకు మీవు - మంచిమాట 125

ఆ.వె॥ అల్పుడతిథి అధికు - దందరిసమముగా
గౌరవించువాడె - జ్ఞానిభువిని
సమతబుద్ధిలేని - సన్యాసమెందుకు
మరువబోకు మీవు - మంచిమాట 126

ఆ.వె॥ ఏమి తెలియదనుచు - ఎరుగుటేజ్ఞానంబు
అన్ని తెలియుననుచు - నరువబోకు
తెలిసికొన్నవాడు - తెలియని యట్లుండు
మరువబోకు మీవు - మంచిమాట 127

ఆ.వె॥ వచ్చినపని మరచి - పుచ్చిన విషయాలు
ముచ్చటించుకొనుచు - ముదముజెందు
చివరికందుఫలము - చిక్కదు కొంతైన
మరువబోకు మీవు - మంచిమాట 128

ఆ.వె॥ హరికిదాసుడగుము - అబ్బును మోక్షంబు
సిరికిదాసుడయిన - చిక్కులెపుడు
దుష్టమైత్రితోడ - దుర్మార్గుడయ్యేవు
మరువబోకు మీవు - మంచిమాట 129

ఆ.వె॥ ఒకరు పోయిరంచు - యొగి నీవు ఏడ్చేవు
నీవుపోకనిచట - నిలువ గలవె
పోకముందెనీవు - పుణ్యంబునార్జించు
మరువబోకు మీవు - మంచిమాట 130

ఆ.వె॥ బయట శత్రుగెలువ - బలముగా దదియెప్డు
లోని శత్రుగెలువ - లోకమంత
ఘనుడు నీవటంచు - గారవింతురు భువి
మరువబోకు మీవు - మంచిమాట 131

ఆ.వె॥ కామతాపపాప - కంటకసహితంబు
కర్మజన్మభువిని - కాపురంబు
సారమింతలేని - సంసారమని నమ్మ
మరువబోకు మీవు - మంచిమాట 132

ఆ.వె॥ ఇంద్రియాది సుఖము - ఎంతొ వింతగదోచు
సత్యమింతలేదు - చావుతప్ప
ఇంద్రియాది గుణము - ఇపుడైన తెలియుము
మరువబోకు మీవు - మంచిమాట 133

ఆ.వె॥ భోగియిచటబొందు - భోగాలనెప్పుడు
యోగిఅచటబొందు - భోగములను
భోగియోగియొక్క - భోగాలు తెలియుమా
మరువబోకు మీవు - మంచిమాట 134

ఆ.వె॥ కామరహితమైన - కర్మలుచేయుచు
పాపచయమునెల్ల - పారద్రోలి
గురువుసేవచేసి - గుర్తునుగనవలె
మరువబోకు మీవు - మంచిమాట 135

ఆ.వె॥ సభలనున్నతముగ - చక్కగాతెల్పియు
తానుతప్పుచేయు - ధర్మమొదలి
తానునడువకున్న - తత్వబోధలుయేల
మరువబోకు మీవు - మంచిమాట 136

ఆ.వె॥ కష్టసుఖములందు - కలిమిలేములయందు
పొగడునపుడు మరియు - తెగడునపుడు
క్రుంగిపొంగనతడు - కులకీర్తిపెంచును
మరువబోకు మీవు - మంచిమాట 137

ఆ.వె॥ మూడువిడుచువాని - మూర్ఖుడందరు గాదె
మూడువిడుచువాడె - ముక్తిఘనుడు
ముదముగూర్చునీకు - మూటిని గనుగొన్న
మరువబోకు మీవు - మంచిమాట 138

(మూడు - సిగ్గు, మానము, అభిమానము)

ఆ.వె॥ అంతరంగమందు - ఆర్గురు శత్రుల
కూల్చువాడెభువిని - గొప్పవాడు
గొప్పవైన నిన్ను - గొప్పగా జూతురు
మరువబోకు మీవు - మంచిమాట 139

ఆ.వె॥ కాల్చియినుము వంచు - కమ్మరి రీతిగా
శిలను మొలచితీర్చు - చిత్రప్రతిమ
శిల్పివోలె, గురుడు - శిష్యుల సరిచేయు
మరువబోకు మీవు - మంచిమాట 140

ఆ.వె॥ శాస్త్రవాదములను - సకలంబు నేర్చియు
అనుభవంబుకొంత - అంటకున్న
అన్నమన్న మనిన - ఆకలి తీరునా
మరువబోకు మీవు - మంచిమాట 141

ఆ.వె॥ తల్లితండ్రిసుతులు - తన వెంట రారెప్డు
పాపపుణ్యములును - పరగవచ్చు

దీనిమరువబోక - తెలిసి వర్తించుమా
మరువబోకు మీవు - మంచిమాట 142

ఆ.వె॥ అల్లుడెపుడు భార్య - యందమున్ గోరును
అధికుడెపుడు దేవు - నాత్మనెరుగు
దీనిమరువబోక - తెలిసి వర్తించుమా
మరువబోకు మీవు - మంచిమాట 143

ఆ.వె॥ ధనమునందు ప్రేమ - దారయందున ప్రేమ
పదవులందుప్రేమ - బంధుప్రేమ
విడచువాడు కాదె - విజ్ఞుండు భువియందు
మరువబోకు మీవు - మంచిమాట 144

ఆ.వె॥ చెడ్డపనులు తాను - శ్రద్ధగా జేయుచు
మంచిఫలము కోరు - మానవులకు
మంచియెట్లు కలుగు - మర్యాదలెట్లబ్బు
మరువబోకు మీవు - మంచిమాట 145

ఆ.వె॥ చావువచ్చునపుడు - చావును తప్పింప
బ్రహ్మకైనతరమె - బ్రదుకు నిల్ప
అట్టిదానిగూర్చి - ఆరాటపడనేల
మరువబోకు మీవు - మంచిమాట 146

ఆ.వె॥ చావురానివాని - చంపంగ వశమౌనె
ఎంతమందికూడి - ఏకమైన
చావుబ్రతుకులన్ని - సహజంబులనినమ్ము
మరువబోకు మీవు - మంచిమాట 147

ఆ.వె॥ తనదు మేలుగోరి - తత్వంబు విడనాడి
పరులకీడుచేయు - పాపిఎపుడు
కష్టనష్టములను - కడతేరడెప్పుడు
మరువబోకు మీవు - మంచిమాట 148

ఆ.వె॥ గురువు యొద్దచేరి - కుటిలచేష్టలు, మది
వదలకున్న వాడు - వట్టిశుంఠ
గురువుపేరుచెరచు - క్రూరులు వీరలు
మరువబోకు మీవు - మంచిమాట 149

ఆ.వె॥ ధనము బలము ప్రాణ - ధర్మంబులన్నియు
నిజముకావటంచు - నీతి తెలిసి
ప్రాణమున్ననాడె - పరమాత్మసేవించు
మరువబోకు మీవు - మంచిమాట 150

ఆ.వె॥ కామకాంచనములె - కడగండ్ల పాల్జేయు
కామకాంచనముల - క్రమము తెలిసి
అక్రమంబువీడి - సక్రమమ్ముగ సాగు
మరువబోకు మీవు - మంచిమాట 151

ఆ.వె॥ తానుమ్రింగునదియు - తనర నాహారంబు
తనను మ్రింగుమృత్యు - తప్పకుండ
మృత్యురాకమున్నె - మురహరి సేవించు
మరువబోకు మీవు - మంచిమాట 152

ఆ.వె॥ కామరహితమైన - కమ్మనిమనసును
మధురమైనమంచి - మాటలెపుడు
అమలు పెట్టువాడె - ఆర్యుడు భువియందు
మరువబోకు మీవు - మంచిమాట 153

ఆ.వె॥ బ్రతుకుట కయి తినును - బ్రహ్మవిజ్ఞానుండు
తినుటకయిబ్రతుకును - తిండిపోతు
ఒకడు ముక్తుడాయె - నొకడుబద్ధుండాయె
మరువబోకు మీవు - మంచిమాట 154

ఆ.వె॥ ఆలుబిడ్డలనుచు - అన్నదమ్ములటంచు
బంధుమిత్రులనుచు - భావనను
ఆశపెంచువాడె - అజ్ఞాని భువియందు
మరువబోకు మీవు - మంచిమాట 155

ఆ.వె॥ చావుతెలిసినరుడు - చావని యట్టుల
చెరువుచేయుచుండు - చెనటియనగ
చెనటి పేరు పొంద - చెడునన్ని విధముల
మరువబోకు మీవు - మంచిమాట 156

## ధనమును గురించి

ఆ.వె॥ ధనము కలుగు వాడు - ధర్మాత్ముడైయున్న
దిక్కులందు వెలుగు - దివ్యకీర్తి
కీర్తిబొందలేని - కీచకులెందుకు
మరువబోకు మీవు - మంచిమాట 157

ఆ.వె॥ అప్పుచేయు వాడె - అధముండు భువియందు
తప్పుచేయకున్న - తత్వవిదుడు
అప్పుతప్పువదలి - ఆనందమొందుమా
మరువబోకు మీవు - మంచిమాట 158

ఆ.వె॥ అప్పుచేయువాడె - అవనిలో అధముండు
అప్పులేనివాడు - ఆర్యనుతుడు

అప్పుతిప్పలెరిగి - అనువుగా జీవించు
మరువబోకు మీవు - మంచిమాట 159

ఆ.వె॥ దుష్టవృత్తిచేసి - దుడ్డును బొందియు
అధికభోగములను - అనుభవింప
చివరకన్ని నిన్ను - చిక్కులపాల్జేయు
మరువబోకు మీవు - మంచిమాట 160

ఆ.వె॥ ధనముగల్గువాడు - ధరలోన రాణించు
ధనముగల్గువాడె - దాతయగను
ధనము గలుగువాని - ధరలోన మెత్తురు
మరువబోకు మీవు - మంచిమాట 161

ఆ.వె॥ యాచనంబుచేసి - యర్థంబుకూర్చుట
దానికంటె చెడ్డ - ధరణి కలదె
దాతగా బ్రదుకుము - ధరణిలో నొకనాడు
మరువబోకు మీవు - మంచిమాట 162

ఆ.వె॥ ధనము లోభికూర్చు - దండిగా భువియందు
అయినఫలము గలదె - అతనికెపుడు
అనుభవించలేడు - అర్థికి పెట్టడు
మరువబోకు మీవు - మంచిమాట 163

## స్త్రీ ఔన్నత్యము

ఆ.వె॥ మాననీయతకును - మర్యాదలకునైన
ఇంటిపేరుపెంచు - ఇంతులకును
సాటిలేరు సాధ్వి - సమముగారెవ్వరు
మరువబోకు మీవు - మంచిమాట 164

ఆ.వె॥ సతివిహీన గృహము - సౌఖ్యంబునీయదు
భర్తలేనియిల్లు - భారమెపుడు
సతియుపతియు మైత్రి - సౌఖ్యంబు కలుగదా
మరువబోకు మీవు - మంచిమాట 165

ఆ.వె॥ అధము నాలికంటె - నతిబలవంతుని
బానిసగను బ్రతుక - పడతి కోరు
అధముడనెడు పేరు - అన్నిట హీనంబు
మరువబోకు మీవు - మంచిమాట 166

ఆ.వె॥ పొందదగిన దొకటి - పొలుపుగా సత్కీర్తి
మంచిభార్యకలుగ - మహినిసుఖము
సత్యవాక్కుకంటె - సాధించు ఘనమేమి
మరువబోకు మీవు - మంచిమాట 167

ఆ.వె॥ ఋణము చేయువాడు - రుగ్మత కలవాడు
చెడ్డభార్యతోడ - చెలగువాడు
ఇహము పరము లేదు - ఇటువంటివారికి
మరువబోకు మీవు - మంచిమాట 168

ఆ.వె॥ ఇంటి పేరు పెరుగు - ఇల్లాలివల్లనే
కులముపేరు పెరుగు - కొడుకు వలన
వదరుపోతువలన - వైరాలు పెరుగును
మరువబోకు మీవు - మంచిమాట 169

ఆ.వె॥ సతిమది నెరిగియును - సఖ్యత పతియెప్డు
పతి మది నిలయెరిగి - భర్తకూడి
కలిసి మెలసి బ్రతుకు - కారకుల్ వారలే
మరువబోకు మీవు - మంచిమాట 170

ఆ.వె॥ మూర్ఖ చిత్తవృత్తి - మూర్ఖులపనులును
స్వార్థగుణముమాన్ప - చాలరెవరు
వీరి మాన్ప మరల - విష్ణువేరావలె
మరువబోకు మీవు - మంచిమాట 171

## స్వార్థము

ఆ.వె॥ స్వార్థమొకటియున్న - సకలంబు చెరచును
స్వార్థమొకటి విడువ - సర్వమబ్బు
స్వార్థమందునెంత - స్వారస్యమున్నదో
మరువబోకు మీవు - మంచిమాట 172

## భక్తి

ఆ.వె॥ దైవప్రేమ తమకు - ధర్మభక్తులకెల్ల
తల్లిదండ్రి ప్రేమ - ధరణి సుతుడు
పడుచు భార్య ప్రేమ - భర్త కోరుచునుండు
మరువబోకు మీవు - మంచిమాట 173

ఆ.వె॥ హృదయమందు దేవు - డుదయించినంతనె
పాపమెంతయున్న - భస్మమగును
ఆత్మగాంచువాడె - అన్నిటఘనుడౌను
మరువబోకు మీవు - మంచిమాట 174

ఆ.వె॥ మాటయందురామ - మనసునందును భామ
మనసు నందునొకటి - మాటనొకటి
బూటకంపు పనులు - బుద్ధిహీనులు వీరె
మరువబోకు మీవు - మంచిమాట 175

ఆ.వె॥ సత్యవచనమెంతొ - సారంబు గల దంద్రు
యజ్ఞయాగవ్రతము - లెన్నియయిన
సత్యవాక్కునకును - సాటియా! భువియందు
మరువబోకు మీవు - మంచిమాట 176

## మాటలో మాణిక్యాలు

ఆ.వె॥ బాణమేయనదియు - ప్రక్కకు పోవచ్చు
మాటవిడువనదియు - మదిని జొచ్చు
మాటలాడునపుడు - మంచిగాయోచించు
మరువబోకు మీవు - మంచిమాట 177

ఆ.వె॥ కట్టెయందు పుట్టి - కట్టెనే కాల్చిన
అగ్నిఓలెకాల్చు - అవనిపలుకు
పలుకువిలువ తెలిసి - పలుకుటే జ్ఞానంబు
మరువబోకు మీవు - మంచిమాట 178

ఆ.వె॥ అనుభవంబె ధరణి - అద్భుత గురుడౌను
అనుభవంబులేని - అజ్ఞులెపుడు
పెద్దవారిమాట - పెడచెవి నుంతురు
మరువబోకు మీవు - మంచిమాట 179

ఆ.వె॥ అన్ని తెలిసి తాను - అల్పజ్ఞుడనుచుండు
తెలివిలేనివాడు - తెలియుననును
మాటవిధము తెలిసి - మనుజుల గుర్తించు
మరువబోకు మీవు - మంచిమాట 180

ఆ.వె॥ మధురమైన మాట - మరువక మాటాడు
మంచి పంచిపెట్టు - మానవులకు

ఇట్టులున్న నిన్ను - నింపుగా పొగిడేరు
మరువబోకు మీవు - మంచిమాట 181

## సోమరితనము

ఆ.వె॥ సోమరులకునిచట - చోటులేదంచును
వ్యాస ఆశ్రమమున - వదలకుండ
ప్రార్థనపుడు వారు - పలుకుచునుందురు
మరువబోకు మీవు - మంచిమాట 182

ఆ.వె॥ సోమరత్వమొకటి - సొంపుగనీకున్న
చెడ్డగుణము లన్ని - చేరునిన్ను
అపుడు జనులు నిన్ను - అధమాధముండంద్రు
మరువబోకు మీవు - మంచిమాట 183

## విద్య - విశిష్టత

ఆ.వె॥ మధురమైనయట్టి - మానవ జన్మంబె
అబ్బెనందు విద్య - అందమిచ్చు
కవివి అయిన మిగుల - ఖ్యాతిని పెంచును
మరువబోకు మీవు - మంచిమాట 184

ఆ.వె॥ సేవ చేయువాడు - సేవింప బడుచుండు
సేవచేయు వాడు - శ్రేష్టుడిలను
సేవచేయకున్న - చెడును సర్వంబును
మరువబోకు మీవు - మంచిమాట 185

ఆ.వె॥ ప్రజ్ఞలేనిచదువు - ఫలియించదెప్పుడు
నీతిలేనిమాట - నిలువబోదు

భక్తిలేనిపూజ - ఫలియించదెప్పుడు
మరువబోకు మీవు - మంచిమాట 186

## సమయము

ఆ.వె॥ అనుదినంబు వార్త - లన్నియు చదివియు
చేయకల్గుదేమి - చెడును'టయము'
సమయ మహిమ నెరిగి - చక్కగా వర్థిల్లు
మరువబోకు మీవు - మంచిమాట 187

## కోపము

ఆ.వె॥ కోపమొకటియున్న - కొదవగు సుఖములు
కోపమొకటివిడువ - కోర్కెలమరు
కోపమెంతచెడుదొ! - కొంపలు ముంచును
మరువబోకు మీవు - మంచిమాట 188

ఆ.వె॥ పక్షులందుకాకి - పరమనీచంబండ్రు
మనుషులందుపాపి - మహినికోపి
కోపమొకటి విడువ - కొనియాడుభువియెల్ల
మరువబోకు మీవు - మంచిమాట 189

## విధిబలీయము

ఆ.వె॥ నాతిచీర గట్టి - నడిమికి చించియు
భార్యవదలి నలుడు - పారిపోయె
విధియువదలదెంత - విజ్ఞులనైనను
మరువబోకు మీవు - మంచిమాట 190

ఆ.వె॥ లంకయేలె రాజు - లక్షయాబైవేలు
కామమనెడి పాము - కాటువేయ

తానువంశమంత - తప్పక చచ్చిరి
మరువబోకు మీవు - మంచిమాట 191

ఆ.వె॥ ఆర్యనుతుడు ప్రభువు - ఆ హరిశ్చంద్రుడు
భార్యసుతులనమ్మి - బానిసాయె
కాలమహిమ చెప్ప - కాదెవ్వరికి నైన
మరువబోకు మీవు - మంచిమాట 192

## జంతు బలి

ఆ.వె॥ జంతువులను నరికి - జగదాంబ గొల్చిన
అంబమిమ్ముకావ - దయ్యాలార
పాపమెపుడు మిమ్ము - పట్టి పీడించును
మరువబోకు మీవు - మంచిమాట 193

ఆ.వె॥ కులము కులమటంచు - కులముగూర్చి మీరు
నాదులాడుటెల - వదరుటేల
కులముకంటె ఘనము - గుణమని యెరుగుడీ
మరువబోకు మీవు - మంచిమాట 194

ఆ.వె॥ ధనముకన్నమిన్న - ధరణిలో గొప్పది
మంచిమాటయనియు - మరువబోకు
మంచిమాట వినుట - మానవధర్మంబు
మరువబోకు మీవు - మంచిమాట 195

ఆ.వె॥ పెద్దవారి సేవ - ప్రేమతో చేసియు
తెలిసి కొన్న నీతి - తెలుపుచుంటి
అనుభవించిచూడు - మానందమిచ్చును
మరువబోకు మీవు - మంచిమాట 196

ఆ.వె॥ మంచికోరినేను - మంచిమాటలగూర్చి
మణులహారముగను - మలచినాడ
మంచివారుదీని - మరువక ధరియింత్రు
మరువబోకు మీవు - మంచిమాట 197

ఆ.వె॥ మంచిమాటకంటె - మహియందు ఘనమేది
మంచిమాట వినిన - మాన్యుడగును
మంచిమాట వినక - మడిసిరి యెందరో
మరువబోకు మీవు - మంచిమాట 198

ఆ.వె॥ మంచిమాట చదువ - మంచివారౌదురు
మంచి తెల్పగోరి - మనసుకలిగి
మంచికోరి వ్రాసె - మహిజనార్దనుడిల
మరువబోకు మీవు - మంచిమాట 199

ఆ.వె॥ మంగళములు మంచి - మాటలకెప్పుడు
మరువబోకు నీకు - మంగళంబు
ప్రేమతోడచదువ - పెద్దలు మెత్తురు
మరువబోకు మీవు - మంచిమాట 200